జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED
గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంచార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.
ప్రజాజ్యోతి సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

రంగారెడ్డి బుధవారం 4 మార్చి 2026 సంపుటి : 1 సంచిక : 62 వెల: రూ.5 పేజీలు: 08 RNI NO.APTEL/2010/36516
విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి
Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# అర్హులందరికీ సంక్షేమం



- లబ్ధిదారుల ముఖ గుర్తింపు కచ్చితంగా అమలు చేయాలి
- సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలి
- ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'
- జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుక
- అన్ని స్థాయుల ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం
- కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

హైదరాబాద్

"నిజమైన అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలి. పథకాలవారీగా ప్రభుత్వం చేకూరుస్తున్న లబ్ధిని గ్రామసభల్లో ప్రజలకు వివరించాలి. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తదితర పథకాలపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలి. విద్యా వ్యవస్థలో ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

- మిగతా2లో



## మౌనమే భారత ప్రతిష్ఠను తగ్గిస్తోంది

- ఖమేనీ మృతిపై మోదీ మాట్లాడాలి
- పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ఆందోళన వ్యక్తం చేసిన రాహుల్
- ఖమేనీ హత్యపై ప్రధాని మోదీ మౌనం వీడాలని వ్యాఖ్య



## ఇరాన్ సంక్షోభం

- భారత్ వద్ద ఉన్న చమురు నిల్వలు ఎంత?
- క్రూడ్ ఆయిల్ నిల్వలకు సంబంధించి భారత్ సేఫ్ జోన్ లో ఉన్నట్టే!
- దేశంలో ప్రస్తుతం 25 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు

# వార్ అక్కడ.. వర్రీ ఇక్కడ!



- యుద్ధం నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన పెట్టుబడిదారుల్లో ఆందోళన
- పలువురు రాజకీయ, సినీ, రియల్ ఎస్టేట్ ప్రముఖులకు గల్ఫ్ దేశాల్లో బిజినెస్‌లు
- వీరిలో పలువురు బినామీల పేర్లతో పెట్టుబడులు
- ఇరాన్ దాడులతో వణుకుతున్న దుబాయ్, అబుదాబి, దోహా, షార్జా నగరాలు



# రాజ్యసభ రేసులో 16 మంది


### జాబితా హైకమాండ్‌కు ఇచ్చాం : టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్
### జస్టిస్ సుదర్శన్‌రెడ్డి రాజ్యసభ అడగడం లేదు
### మాజీ మావోయిస్టులు కాంగ్రెస్‌లోకి వస్తామంటే ఆహ్వానిస్తాం

హైదరాబాద్

రాజ్యసభ స్థానాల కోసం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర పోటీ ఉందని, మొత్తం 16 మంది ఆశిస్తున్నారని, సామాజిక వర్గాల వారీగా వారి జాబితాను హైకమాండ్ ఇచి?చనట్టు టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. రాజ్యసభ అభ్యరి?థత్వాల గురించి రాహుల్‌గాంధీ వచ్చిన సందర్భంగా ప్రస్తావనకు వచ్చినా, ఖరారు కాలేదని తెలిపారు. అభ్యర్థుల ఎంపికకు ఒకవేళ ఢిల్లీ వెళ్లాల్సి వస్తే బుధవారం వెళతామని, లేదంటే అధిష్టానం పెద్దలతో ఫోన్‌లో మాట్లాడతామని వెల్లడించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం నుంచి నలుగురు సమర్థవంతమైన బీసీ నేతలు రాజ్యసభ సీటు ఆశిస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ నేతలు కూడా ఉన్నారన్నారు. రాజ్యసభ అభ్యర్థిత్వాల గురించి ఏఐసీసీ అన్ని అంశాలను బేరీజు వేస్తోందని, ముఖ్యంగా సామాజిక

- మిగతా2లో

## చర్చలు, దౌత్యానికే భారత్ మద్దతు



- 48 గంటల్లో 8 పశ్చిమాసియా దేశాధినేతలతో మాట్లాడిన మోదీ
- ఒమన్, కువైట్‌లో జరుగుతున్న దాడులపై ఆందోళన వ్యక్తం చేసిన మోదీ
- ఒమన్ సుల్తాన్, కువైట్ రాజుతో మాట్లాడిన మోదీ
- ఒమన్, కువైట్‌లో ఉన్న భారతీయుల భద్రత గురించి ఆరా తీసిన మోదీ



# బాంబుల వర్షం



- ఇరాన్ అధ్యక్ష భవనం నేలమట్టం
- 2 అణు కేంద్రాలు, సుప్రీం లీడర్ ఎన్నిక జరిగే భవనంపైనా క్షిపణులు
- లెబనాన్‌లోకి ప్రవేశించిన ఇజ్రాయెల్ సైన్యం
- ఇప్పటిదాకా 787 మంది ఇరానీయుల మృతి
- అమెరికా లక్ష్యంగా గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు
- సౌదీ, కువైట్‌లలోని యూఎస్ ఎంబసీలపై డ్రోన్లు
- అమెజాన్ డేటా సెంటర్లపైనా..
- ఆరుగురు అమెరికా సైనికుల మృత్యువాత
- దాడికి గురైన నౌకలోని ముగ్గురు భారతీయ సిబ్బంది మరణం
- ఇరాన్‌పై ఖతార్ ఎదురుదాడి..

## టెహ్రాన్, బీరుట్‌లపై అమెరికా, ఇజ్రాయెల్ భీకర దాడులు

దుబాయ్

పశ్చిమాసియాలో బాంబుల వర్షం కురుస్తోంది. యుద్ధం నాలుగో రోజైన మంగళవారం దాడులు మరింత ఉద్ధృతమయ్యాయి. ఇరాన్, లెబనాన్‌లపై అమెరికా-ఇజ్రాయెల్ విరుచుకుపడ్డాయి. ఇరాన్ అధ్యక్ష భవనంతోపాటు రెండు అణు కేంద్రాలపై దాడులు చేశాయి. ఖమేనీ వారసుడిని ఎన్నుకోవడానికి ఓటింగ్ నిర్వహించాల్సిన కార్యాలయంపైనా బాంబులు వేశాయి. మరోవైపు హెజ్‌బొల్లా లక్ష్యంగా దాడులకు దిగిన ఇజ్రాయెల్ సైన్యం.. లెబనాన్‌లోకి ప్రవేశించింది. ఇటు అమెరికా స్థావరాలు, ఎంబసీలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది. అమెజాన్ సెంటర్లపైనా దాడులు చేసింది. యుద్ధం కారణంగా మరణాల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఒక్క ఇరాన్‌లోనే నాలుగు రోజుల్లో 787 మంది మృతి చెందారు. లెబనాన్‌లో 52 మంది మృత్యువాత పడ్డారు. హార్మూజ్ జలసంధిలో ఇరాన్ దాడి చేసిన నౌకలోని సిబ్బందిలో ముగ్గురు భారతీయులు మరణించారు. అమెరికాకూ పెద్ద దెబ్బే తగిలింది. ఆ దేశానికి చెందిన ఆరుగురు సైనికులు మరణించారు. 18 మందికి తీవ్రంగా గాయాలయ్యాయి. పశ్చిమాసియాలోని విమానాశ్రయాలు మంగళవారమూ తెరుచుకోలేదు. అక్కడ చిక్కుకున్న వారిలో అతి కొద్ది మందినే కొన్ని విమానాల ద్వారా తరలించగలిగారు. గల్ఫ్ దేశాల్లోని తమ పౌరులను అమెరికా ఖాళీ చేయిస్తోంది. ఐరోపా దేశాలూ తమ వారిని తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఇరాన్ మళ్లీ అణు కార్యక్రమాన్ని

- మిగతా2లో

# అర్హులందరికీ 'సంక్షేమం'

-మొదటిపేజీ తరువాయి

సర్కారు దవాఖానాలను పటిష్ఠం చేసేందుకు.. సమీపంలోని బోధనాసుపత్రులతో అనుసంధానం చేయాలి. మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ప్రతి నెలా కచ్చితంగా బిల్లులు అందేలా చూడాలి. 99 రోజుల కార్యక్రమాల్లో అన్ని స్థాయిల ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సచివాలయంలో మంగళవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం నిర్వహించాలని.. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను ఐదు దశల్లో అమలు చేయాలని ఆదేశించారు. దీనికి 'ప్రణాళిక శాఖ' నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని సీఎం తెలిపారు. మార్చి 6న అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహించాలని, 99 రోజుల్లో శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలపై ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి సూచించారు. కలెక్టర్ల సదస్సుకు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఈ సదస్సులో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర్ రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, సీతక్క, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, డీజీపీ శివధర్‌రెడ్డి, వివిధ శాఖల ముఖ్యకార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనలు, ఆదేశాలు..**

"వార్డు సభ్యులు, సర్పంచులు, ఛైర్‌పర్సన్లు, కార్పొరేటర్లు, మేయర్లు.. అందరికీ జిల్లా కేంద్రాల్లో ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలి.

శాఖల వారీగా పది వారాలపాటు అమలు చేసే ప్రత్యేక కార్యాచరణ అందరినీ ఆకట్టుకునేలా ఉండాలి. ప్రతి జిల్లాకో సీనియర్ ఐఏఎస్ అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించాలి. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి.

సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలి. వ్యవసాయానికి సోలార్ పంపుసెట్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలి. ఇళ్లపై సోలార్ ప్లాంట్లు అమర్చుకోవడం.. గ్రిడ్‌కు అనుసంధానం చేయడం ద్వారా వచ్చే ఆదాయంపై అన్ని గ్రామాల్లో విద్యుత్ శాఖ అవగాహన కల్పించాలి.

నూతనంగా ఇచ్చిన రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200లోపు యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ లబ్ధిదారుల వివరాలు గ్రామ, వార్డు సభల్లో తెలియజేయాలి. వాటితో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో కలిగిన లబ్ధిని



ప్రజలకు వెల్లడించాలి.

రాష్ట్రంలో ఉన్న 35 ప్రభుత్వ వైద్య కళాశాలల సేవలు ప్రజలకు అందేలా చూడాలి. స్థానిక వైద్య సంస్థల నుంచి రోగులను ఉన్నత వైద్యానికి ప్రభుత్వ మెడికల్ కాలేజీలకే రిఫర్ చేయాలి. తద్వారా వైద్య కళాశాలల వసతులను సద్వినియోగం చేసుకోవాలి. కలెక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రులను తరచూ సందర్శించాలి. వైద్యంపై ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోంది. ఏటా సీఎంఆర్ఎఫ్, ఆరోగ్యశ్రీకి దాదాపు రూ.2,500 కోట్లు ఖర్చు పెడుతోంది. అంత ఖర్చుతో ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అద్భుతమైన సేవలను అందించే వీలుంటుంది. సర్జరీలు చేసే డాక్టర్లకు ప్రత్యేక ఇన్సెంటివ్‌లను ఇవ్వటంతో పాటు అడ్మినిస్ట్రేషన్‌ను, డాక్టర్ల సేవలను విభజించే ఆలోచన ఉంది.

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ప్రతి నెలా ఎలాంటి ఇబ్బంది లేకుండా బిల్లులు చెల్లించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందేలా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లదే. ప్రతి పాఠశాలలో రోజూ ఒక్కో అధికారి మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షించేలా చూడాలి. కలెక్టర్లు వారానికి ఒకసారి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేయాలి. రాష్ట్రంలో ఎక్కడా ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతం కాకూడదు. పాఠశాలలు, విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రభుత్వం సహించదు. డీఈవోలతోపాటు అక్కడి కలెక్టర్లపై చర్యలు తీసుకుంటుంది.

వచ్చే విద్యా సంవత్సరంలోనే వంద నియోజకవర్గాల్లో ఎంపిక చేసిన మండలాల్లో ఒక తెలంగాణ ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ప్రారంభిస్తాం. ఎమ్మెల్యేల సూచనలతో అక్కడున్న మౌలిక వసతులపై నివేదిక ఇవ్వాలి. జూన్ 12న అన్ని స్కూళ్లలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందించాలి.

పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి, డ్రగ్స్, ఈ-సిగరెట్ల వినియోగం జరిగితే.. అందుకు ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలు బాధ్యత వహించాలి. ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాల, కళాశాలల్లో సైకాలజిస్ట్ ఉండేలా చూడాలి.

మూడు కార్పొరేషన్లతోపాటు నగరాలు, పట్టణాల్లోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు, బాలబాలికల హాస్టళ్ల వివరాలు నమోదు చేసుకోవాలి. వాటిపై పర్యవేక్షణ ఉండాలి.

వ్యవసాయశాఖ భూసార పరీక్షలు చేపట్టి సకాలంలో రైతులకు వాటి సమాచారం అందజేయాలి. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసేలా అన్నదాతలను ప్రోత్సహించాలి.

యూరియా యాప్‌లో కొంత గందరగోళం ఉన్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. దాన్ని సులువుగా వినియోగించేలా మార్పులు చేయాలి. నానో యూరియా ఉపయోగాలను క్షేత్రస్థాయిలో ప్రదర్శన ద్వారా రైతులకు వివరించాలి.

వ్యవసాయ, పౌర సరఫరాల శాఖలు పరస్పరం సమన్వయంతో ముందుకు సాగాలి. పంటలు వేసింది మొదలు.. ఉత్పత్తుల అమ్మకం వరకు.. సరైన కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తే ఇబ్బందులు తొలగుతాయి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రతి ప్రభుత్వ పథకం లబ్ధిదారు ముఖ గుర్తింపు(ఫేషియల్ రికగ్నైజేషన్) చేపట్టాలి. అర్హులకు కచ్చితంగా లబ్ధి జరగాలి. అదే సమయంలో అనర్హులు లబ్ధిపొందకూడదు. ఆసరా పింఛన్లలో ముఖ గుర్తింపు చేపట్టడంతో.. 3 లక్షల మంది అనర్హుల పేర్లు తొలగించగలిగాం.

**వాహన డ్రైవర్లకు పరీక్షలు**

రవాణా శాఖ డేటా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలి. పాఠశాలల బస్సులు, ఇతర వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు సక్రమంగా నిర్వహించాలి. ఆర్టీసీ బస్సు డ్రైవర్లతో పాటు లారీలు, ఇతర సరకు రవాణా వాహనాల డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించాలి. రహదారులపై భారీ స్థాయిలో గుంతలు, ప్రమాదాలు జరిగే స్థలాల వివరాలు తెలుసుకునేందుకు వాట్సప్ నంబర్‌ను రవాణా శాఖ ఇవ్వాలి. ఆ నంబర్‌కు వచ్చే సమాచారం ఆధారంగా అక్కడ మరమ్మతులు, ఇతర చర్యలు చేపట్టాలి.

ఓఆర్ఆర్, సర్వీసు రోడ్ల వెంట భారీగా చెత్త, ఇతర నిర్మాణ వ్యర్థాలు డంప్ చేస్తున్నారు. వ్యర్థాలను తీసుకువచ్చే వాహనాల యజమానులపై కేసులు పెట్టి.. జరిమానాలు విధించాలి. ఓఆర్ఆర్ ఏజెన్సీ వారిని బాధ్యులను చేయాలి.

# నేడు కలెక్టర్ల సదస్సు

-మొదటిపేజీ తరువాయి

గణన నిర్వహణకు 89వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భోజన విరామం అనంతరం 1.45 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రులు, అన్ని శాఖల కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లతో ఉమ్మడి సమావేశాన్ని నిర్వహించనున్నారు. 2 నుంచి 2.30 గంటల వరకు 'ప్రజాపాలన-- ప్రగతి ప్రణాళిక'కార్యక్రమం నిర్వహణపై ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి ఆధ్వర్యంలో కలెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నారు. 2.30 నుంచి 4 గంటల మధ్య 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుపై పురపాలక, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, వైద్యారోగ్య, విద్య, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శుల ఆధ్వర్యంలో కలెక్టర్లకు సూచనలు జారీ చేయనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుదల కోసం పల్లెప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల కొనసాగింపుపై నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది. సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, అటవీ అనుమతుల విషయంలో తీసుకోవాల్సిన చర్యలను కలెక్టర్లకు నిర్దేశించనున్నారు. నీటిపారుదల, రోడ్లు, భవనాలు, రవాణా, అటవీ, రెవెన్యూ, ఐటీ, పరిశ్రమలు, టీజీఐఐసీ విభాగాల ఉన్నతాధికారులు కలెక్టర్లకు అవగాహన కలి?పంచనున్నారు. చివరకు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు రేవంత్ కలెక్టర్లను ఉద్దేశించి మాట్లాడనున్నారు. జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల కార్యదర్శుల పనితీరును ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించి దిద్దుబాటుకు తీసుకోవాల్సిన చర్యలను నిర్దేశించనున్నట్టు తెలిసింది.

## వార్ అక్కడ.. వర్రీ ఇక్కడ!



హైదరాబాద్

గల్ఫ్‌లోని ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో రియల్ ఎస్టేట్, హోటల్, గోల్డ్ ట్రేడింగ్, మైనింగ్ రంగాల్లో అక్కడ భారీ పెట్టుబడులు పెట్టిన మనోళ్లు తీవ్ర ఆందోళనలో పడ్డారు. తాజా పరిణామాలు దుబాయ్ 'సేఫ్--హెవెన్' అనే ఇమేజ్‌ను దెబ్బతీశాయి. దీంతో దుబాయ్, అబుదాబి, దోహా, షార్జా తదితర నగరాల్లో పెట్టుబడులు పెట్టిన తెలంగాణకు చెందిన ప్రముఖులు తలలు పట్టుకుంటున్నారు. వీరిలో 'సీక్రెట్'పెట్టుబడులు పెట్టిన పలువురు రాజకీయ నాయకులు, వారి దగ్గరి బంధువులతోపాటు కొందరు సినీ ప్రముఖులు ఈ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందా అని ఎదురుచూస్తున్నారు.

**లెక్కకు మించి పెట్టుబడులు**

రాజకీయ, సినీ ప్రముఖుల్లో కొందరు బినామీల ద్వారా దుబాయ్‌లో భారీగా పెట్టుబడులు పెట్టారు. ఉత్తర తెలంగాణకు చెందిన పలువురు కీలక నేతలు రియల్ ఎస్టేట్ (లగ్జరీ ఫ్లాట్లు, విల్లాలు), హోటల్స్, గోల్డ్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టారని తెలిసింది. అలాగే దక్షిణ తెలంగాణకు చెందిన ఓ జిల్లాలోని కీలక నేతల్లో ఇద్దరికి దుబాయ్‌లో హోటల్, రియల్ ఎస్టేట్, ఐటీ, మైనింగ్ వ్యాపారాలు ఉన్నట్లు గట్టి ప్రచారం ఉంది.

**రియల్ ఎస్టేట్‌లో తెలుగువాళ్ల పెట్టుబడులు**

2025లో దుబాయ్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో రికార్డుస్థాయిలో సుమారు 249 బిలియన్ డాలర్ల లావాదేవీలు జరిగాయి. ఇందులో భారతీయ పెట్టుబడులే 30 శాతం వరకు ఉన్నట్లు దుబాయ్ ట్రేడ్ వర్గాలను ఉటంకిస్తూ ఓ నివేదిక వెలువడింది. రాజకీయ ప్రముఖులతోపాటు సినీ, రియల్ రంగంలో ఉన్న వారు పెద్దఎత్తున దుబాయ్‌లో పెట్టుబడులు పెట్టినట్లు అంచనా. లగ్జరీ విల్లాలు, అపార్ట్‌మెంట్లు, ఆఫ్--ప్లాన్ ప్రాజెక్టులు దుబాయ్‌లో బూమ్‌లో ఉన్నాయి. కానీ ఇప్పుడు ఇన్వెస్టర్లు 'వెయిట్ అండ్ వాచ్' మోడ్‌లోకి వెళ్లారు. 'పానిక్ లేదు, కానీ డెసిషన్ మేకింగ్ పూర్తిగా ఆగిపోయింది. ఒక క్లయింట్ డీల్ బ్యాక్ అవుట్ చేశాడు. చాలామంది ఒప్పందాలు జాప్యం చేయమంటున్నారు. సైట్ విజిట్స్ తగ్గాయి. లావాదేవీలు 30--40% పడిపోయే అవకాశం ఉంది. లగ్జరీ సెగ్మెంట్ మరింత దెబ్బతింటోంది. ఇన్వెస్టర్లు ఆస్తుల విలువ పడిపోవడం, ఫోర్స్‌డ్ సేల్స్ భయంతో ఉన్నారు'అని దుబాయ్‌లో తెలుగు పెట్టుబడుదారులకు సంబంధించి బ్రోకర్‌గా పనిచేసే వ్యక్తి ఒకరు ఫోన్‌లో చెప్పారు. అలాగే హోటల్, పర్యాటక రంగం మరింత దారుణంగా పడిపోయే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అంతర్జాతీయ విమానాలు రద్దు కావడంతో అరైవల్స్ తగ్గాయి. పామ్ జుమైరా, దుబాయ్ మెరీనా హోటల్స్ ఆక్యుపెన్సీ రేట్లు దారుణంగా పడిపోయాయి. మైనింగ్, గోల్డ్ బిజినెస్‌లో డైరెక్ట్ డ్యామేజ్ తక్కువే అయినా, ఇన్సూరెన్స్ ఖర్చులు భారీగా పెరుగుతున్నాయి. కాంట్రాక్టులు రీ--నెగోయేట్ అవుతున్నాయి. ఇవన్నీ గల్ఫ్‌లో పెట్టుబడిపెట్టిన తెలుగు ప్రముఖులను ఆందోళనకు గురి చేస్తున్నాయి.

## రాజ్యసభ రేసులో 16 మంది

-మొదటిపేజీ తరువాయి



సమీకరణలను పరిగణనలోకి తీసుకుంటోందని, సామాజిక కూర్పుతోనే అభ్యర్థిత్వాలు ఖరారయ్యే అవకాశముందని చెప్పారు. జస్టిస్. బి.సుదర్శన్‌రెడ్డి రాజ్యసభ స్థానాన్ని అడగడం లేదని చెప్పారు.

**రెండింటి విధానాలూ ఒకటే**

మావోయిస్టు ఎజెండా, కాంగ్రెస్ విధానం ఒకటేనని, పేదల సంక్షేమం, దేశ అభివృద్ధే ధ్యేయమని మహేశ్‌గౌడ్ చెప్పారు. అయితే, వారు ఆయుధాలు పట్టుకున్నారని, తాము ప్రజాస్వామ్యబద్ధంగా సేవ చేస్తామని, ఇదే తేడా అని అన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సరైన వేదిక అని, మాజీ మావోయిస్టులు పార్టీలోకి వస్తామంటే ఆహ్వానిస్తామని చెప్పారు. అయితే, తాము ఎవరినీ పార్?టిలోకి రావాలని అడగలేదని, మాజీ మావోయిస్టులు కూడా తమను సంప్రదించలేదన్నారు. జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల నిర్మాణానికి స్థలాలు తీసుకుంటామని మహేశ్‌గౌడ్ చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వానికి లేఖ రాశామని, మార్కెట్ విలువ ఎంత ఉందో అంత చెల్లించి ఎకరం స్థలం తీసుకుంటామని, ఇందుకోసం ఏడు జిల్లాల్లో స్థలాల ఎంపిక కూడా జరిగిందన్నారు. బీఆర్ఎస్ తరహాలో పుక్కటికిమాత్రం ప్రభుత్వ స్థలాలు తీసుకోబోమని వ్యాఖ్యానించారు. కొన్ని చోట్ల ఎమ్మెల్యేలు, మంత్రులు తమకు సహకరించడం లేదని డీసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీకి చెప్పారని, అలాంటి చోట్ల అందరు నేతలను పిలిపించి మాట్లాడుతామన్నారు.

# దేవాదుల 100 టీఎంసీలు

హైదరాబాద్

రెండు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉండిపోయిన జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం సామర్థ్యాన్ని 38 నుంచి 100 టీఎంసీలకు పెంచే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఇటీవల ప్రాజెక్టును సందర్శించిన సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి ఈ మేరకు వచ్చిన విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. దేవాదుల సామర్థ్యం పెంచేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. సీఎంఓ కార్యదర్శి మాణిక్‌రాజ్, నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు. తొలుత 50 టీఎంసీలు: గోదావరి ఎత్తిపోతలు పథకం పేరుతో 1995--2000 మధ్య దేవాదుల ప్రాజెక్టు తెరపైకి వచ్చింది. గోదావరి నుంచి జూన్--నవంబర్ మధ్యకాలంలో 150 రోజుల పాటు 50 టీఎంసీలు తరలించి 2 లక్షల హెక్టార్లకు సాగునీటిని అందించాలని అప్పట్లో యోచించారు. ఈ మేరకు ప్రాజెక్టు నిర్మాణంపై అధ్యయనం జరపడానికి 2001లో జీవో జారీ చేశారు. అయితే తొలి దశ కింద 5.18 టీఎంసీలు తరలించి 1.23 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి 2003లో, రెండో దశ కింద 7.25 టీఎంసీలను తరలించి 1.93 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి 2005లో, మూడో దశ కింద 25.75 టీఎంసీలను తరలించి 2.39 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి 2007లో పరిపాలనపరమైన అనుమతులు జారీ అయ్యాయి. మొత్తం మూడు దశల్లో 38.16 టీఎంసీలను తరలించి 5,56,722 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేలా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు.

**ప్రాజెక్టు ప్రారంభించిన వైఎస్ ప్రభుత్వం**

2005లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం జలయజ్ఞం కింద ఈ ప్రాజెక్టు పనులను ప్రారంభించింది. 2005లోనే ప్రాజెక్టుకి పర్యావరణ, అటవీ అనుమతులు



లభించాయి. మూడు దశలు కలిపి మొత్తం రూ.6,016 కోట్ల వ్యయం అంచనాలతో ప్రాజెక్టు నిర్మించడానికి ప్రణాళిక సంఘం పెట్టుబడి అనుమతులు (ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్) ఇచ్చింది. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)లోని టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ) 2007లో అనుమతులు జారీ చేసింది. అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం 2015లో దేవాదుల ప్రాజెక్టు సామర్థ్యాన్ని 50 నుంచి 60 టీఎంసీలకు పొడిగించింది. కానీ సీడబ్ల్యూసీ అభ్యంతరం వ్యక్తం చేయడంతో 38.16 టీఎంసీలకే పరిమితమయ్యింది. మూడు దశల కింద హనుమకొండ, వరంగల్, కరీంనగర్, భూపాలపల్లి, సిద్దిపేట, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, జనగామ, ములుగు జిల్లాల్లో ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి.

**వచ్చే కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం!**

'సత్వర సాగునీటి ప్రయోజన పథకం (ఏఐబీపీ)'కింద ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా ఆర్థిక సహాయం అందింది. ప్రాజెక్టు అంచనా వ్యయం 2005--06లో రూ.6,016 కోట్లుగా ఉండగా.. 2016--17 నాటికి రూ.13,445 కోట్లకు చేరింది. తాజాగా రూ.18,400 కోట్లకు చేరింది. దీన్ని రాష్ట్ర మంత్రివర్గంలో ఆమోదించాల్సి ఉంది. అంచనాల పెంపుతో పాటు, తాజాగా ప్రాజెక్టు సామర్థ్యం పెంచాలనే నిర్ణయం తీసుకోవడంతో ఈ రెండు ప్రతిపాదనలపై తదుపరి కేబినెట్ భేటీలో చర్చించి కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

**ఎస్ఆర్ఎస్పీ--2 ఆయకట్టు స్థిరీకరణ!**

ప్రాజెక్టు సామర్థ్యం 100 టీఎంసీలకు పెంచితే ఏడాదిలో 300 రోజుల పాటు నీళ్లను తరలించి దేవాదుల ఆయకట్టుతో పాటు ఎస్ఆర్ఎస్పీ--2 ఆయకట్టు స్థిరీకరణకు వీలుంటుందని స్థానిక ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ఇప్పటివరకు రూ.14,359 కోట్ల వ్యయంతో పనులు జరిగాయి. అయితే భూసేకరణ, నిధుల సమస్యలతో ప్రాజెక్టు పనులు ముందుకు సాగడం లేదు.

**మరో రూ.4 వేల కోట్లు అవసరం**

మొత్తం 34,089 ఎకరాలకు గాను 31,953 ఎకరాలు సేకరించారు. మరో 2,136 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ప్రాజెక్టు కింద దాదాపు 5.57 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటిదాకా 3.38 లక్షల ఎకరాలకే సాగునీరు అందిస్తున్నారు. మిగతా 2,136 ఎకరాలు సేకరిస్తే మిగిలిన 2.23 లక్షల ఎకరాలకు కూడా నీరందుతుంది. ప్రభుత్వం రూ.600 కోట్లను విడుదల చేస్తే భూసేకరణ పూర్తికానుంది. పెరిగిన అంచనాల ప్రకారం భూసేకరణతో సహా మిగులు పనుల పూర్తికి మరో రూ.4 వేల కోట్లు అవసరం కానున్నాయి. మొత్తం మీద వచ్చే 18 నెలల్లో ప్రాజెక్టును పూర్తి చేసి 2.23 లక్షల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించాలని ప్రభుత్వం తాజాగా లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

# బాంబుల వర్షం

-మొదటిపేజీ తరువాయి

ప్రారంభించడంవల్లే దాడులకు దిగామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వెల్లడించారు.
తమ ఎంబసీలపై ఇరాన్ దాడుల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. రియాద్‌లోని తమ ఎంబసీపై జరిగిన దాడి, అమెరికన్ సైనికుల హత్యకు ప్రతిస్పందన ఎలా ఉంటుందో వారు త్వరలోనే తెలుసుకుంటారని స్పష్టం చేశారు. దోహా విమానాశ్రయంపై దాడులకు ప్రతీకారంగా ఇరాన్‌పై ఖతార్ దాడులు చేసింది. అయితే వివరాలు వెల్లడి కాలేదు.

**లెబనాన్‌లోకి..**

ఇరాన్‌కు మద్దతుగా హెజ్‌బొల్లా మిలిటెంట్లు రంగంలోకి దిగడంతో ఇజ్రాయెల్ మరింత దూకుడు పెంచింది. దక్షిణ లెబనాన్‌లోకి సైన్యాన్ని పంపింది. ఒకవైపు వైమానిక దాడులు చేస్తూనే మరోవైపు భూతల పోరుకు సిద్ధమైంది. మరోవైపు ఇజ్రాయెల్ సరిహద్దుల్లో మోహరించిన సైన్యాన్ని అక్కడి నుంచి తరలిస్తున్నామని లెబనాన్ ప్రభుత్వం వెల్లడించినట్లు 'నేషనల్ న్యూస్ ఏజెన్సీ' వెల్లడించింది. ఇజ్రాయెల్‌తో బహిరంగ యుద్ధానికి సిద్ధమని హెజ్‌బొల్లా ప్రకటించింది. ఏడాదిగా ఓపిక పట్టామని, ఇక సహించేది లేదని ఆ సంస్థ ప్రతినిధి మహమూద్ కొమాతీ స్పష్టం చేశాడు. ఇజ్రాయెల్‌లోని వైమానిక స్థావరంపై డ్రోన్లతో దాడులు చేశామని హెజ్‌బొల్లా వెల్లడించింది. వాటిని కూల్చేశామని ఇజ్రాయెల్ తెలిపింది.
ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఇప్పటిదాకా లెబనాన్‌లో 52 మంది మృతి చెందారు.

**అగ్ర రాజ్యమే లక్ష్యం..**

సౌదీ అరేబియాలోని రియాద్‌లో ఉన్న అమెరికా ఎంబసీపై రెండు డ్రోన్లతో ఇరాన్ దాడి చేసింది. స్వల్పంగా భవనం దెబ్బతింది. ఇప్పటికే కువైట్ ఎంబసీపై దాడులు జరిగాయి.
దాడుల నేపథ్యంలో సౌదీ, కువైట్‌లలోని ఎంబసీలను అమెరికా మూసివేసింది. బీ ఖతార్ ఎనర్జీకి చెందిన రెండు కేంద్రాలపై ఇరాన్ దాడులు చేసింది.
యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని తమ డేటా సెంటర్లపై డ్రోన్ల దాడులు జరిగాయని అమెజాన్ ప్రకటించింది. బహ్రెయిన్‌లోని డేటా సెంటర్‌పైనా దాడి జరిగిందని వెల్లడించింది. బీ బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక స్థావరంపై డ్రోన్లు, క్షిపణులతో ఇరాన్ దాడులు చేసింది. దుకం పోర్టులో చమురు నౌకపై డ్రోన్ దాడి జరిగిందని ఒమన్ వెల్లడించింది. అయితే ఎవరూ గాయపడలేదని స్పష్టం చేసింది. ఇజ్రాయెల్‌లోని రమత్ డేవిడ్ వైమానిక స్థావరంపై హెజ్‌బొల్లామిలిటెంట్లు డ్రోన్లతో దాడులు చేశారు.

**ముగ్గురు భారతీయులు..**

పశ్చిమాసియాలోని హర్మూజ్ జలసంధిలో పలు నౌకలపై ఇరాన్ దాడులు చేస్తోంది. విదేశీ జెండాతో వెళ్తున్న నౌకపై జరిగిన దాడిలో మరణించిన భారతీయుల సంఖ్య మూడుకు పెరిగింది. మరొక భారతీయుడు గాయపడ్డారు. పర్షియన్ గల్ఫ్, హర్మూజ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లలోని పరిస్థితిని జాగ్రత్తగా గమనిస్తున్నామని భారత డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ వెల్లడించింది.
పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో 37 భారతీయ రవాణా నౌకలు చిక్కుకున్నాయి. అందులో 1,109 మంది సిబ్బంది ఉన్నారు. ఈ నౌకల్లో కొన్ని ముడి చమురుతోపాటు ఎల్ఎన్‌జీని భారత్‌కు తీసుకొస్తున్నాయి.

**అమెరికాకూ నష్టమే..**

యుద్ధంలో ఇప్పటిదాకా అమెరికా సైనికులు ఆరుగురు మరణించారు. మరో 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. అమెరికా సెంట్రల్ కమాండ్ అధికార ప్రతినిధి కెప్టెన్ టిమ్ హాకిన్స్ ఈ విషయం వెల్లడించారు. వీరంతా కువైట్‌లో ఉన్నవారే.

**హర్మూజ్ జలసంధి మూసివేత**

ప్రపంచ వ్యాప్తంగా 5 శాతం చమురు సరఫరా జరిగే హర్మూజ్ జల సంధిని మూసివేస్తున్నామని ఇరాన్ ప్రకటించింది. ఈ మార్గం ద్వారా చమురు రవాణాకు ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలుంటాయని, ఆ ఓడలను తగులబెడతామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ సలహాదారు బ్రిగేడియర్ జనరల్ ఇబ్రహీం జబ్బారీ హెచ్చరించారు.
ఈ ప్రాంతంలో సుమారు 700 చమురు నౌకలు నిలిచిపోయాయి. బీ పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులతో అక్కడి నుంచి తిరిగి రావాలని డజనుకుపైగా దేశాల్లోని తమ పౌరులకు అమెరికా సూచించింది.
సైప్రస్‌పై ఇరాన్ దాడులకు దిగడంతో రక్షణ కోసం ఆ దేశానికి యుద్ధ నౌకలను పంపుతున్నట్లు బ్రిటన్, ఫ్రాన్స్ ప్రకటించాయి. సైప్రస్‌లోని బ్రిటన్ సైనిక స్థావరంపై దాడులు జరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నాయి.
యుద్ధం కారణంగా తమ గగనతలాన్ని పాక్షికంగా మూసివేస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించింది. ఈ నెల చివరి వరకూ పౌర విమానాలను అనుమతించబోమని పేర్కొంది.

**ప్రజల్లోకి యూఏఈ పాలకులు**

ఇరాన్ దాడుల్లో యూఏఈలోని పలు భవనాలు ధ్వంసం కావడంతో అక్కడి ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో వారిలో ధైర్యం నింపేందుకు యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్, దుబాయ్ క్రౌన్ ప్రిన్స్ అల్ మక్తుమ్, ఇతర సీనియర్ అధికారులు సోమవారం దుబాయ్‌లోని మాల్స్, ఇతర ప్రదేశాల్లో కలియదిరిగారు.

**టెహ్రాన్‌లో బీభత్సం**

ఇజ్రాయెల్ వైమానిక దాడిలో ధ్వంసమైన బీరుట్ శివార్లలో హెజ్‌బొల్లాకు చెందిన అల్-మనార్ టీవీ ప్రధాన కార్యాలయం
టెహ్రాన్‌లోని అధ్యక్ష కార్యాలయం, సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ భవనాలపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. సుప్రీం లీడర్‌ను ఎన్నుకునేందుకు ఓటింగ్ నిర్వహించాల్సిన అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ కార్యాలయమైన 'ఖోం' భవనంపై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు చేశాయి. ఆ భవనం పూర్తిగా ధ్వంసమైంది. ఆ సమయంలో భవనంలో ఎవరున్నారనేది తెలియలేదు.
నతాంజ్ అణు కేంద్రంపై దాడులు జరిగినా పెద్దగా నష్టం జరగలేదని ఇరాన్ వెల్లడించింది. రేడియో ధార్మికత లీకేజీ ప్రమాదమేమీ లేదని వివరించింది. ఆగ్నేయ ఇరాన్‌లోని కెర్మన్ వైమానిక స్థావరంపై అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 13 మంది సైనిక సిబ్బంది మరణించారు.
ప్రత్యేక బలగాల సాయంతో టెహ్రాన్‌లో ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ భూతల ఆపరేషన్‌ను ప్రారంభించిందని అల్ అరేబియా టీవీ వెల్లడించింది.
ఇరాన్‌తో మాట్లాడతా: పుతిన్
ఇరాన్ దాడులతో ఆందోళన చెందుతున్న గల్ఫ్ దేశాలకు రష్యా అధ్యక్షుడు పుతిన్ భరోసా ఇచ్చారు. తాను ఇరాన్‌తో మాట్లాడతానని ఆయన చెప్పినట్లు అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది.

**ఇజ్రాయెల్ కోసం అమెరికా: ఇరాన్**

ఇజ్రాయెల్ ఆకాంక్షల మేరకే అమెరికా యుద్ధంలోకి దిగిందని ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఆరోపించారు. ఇరాన్ ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోవాలని ట్రంప్ పిలుపునిచ్చారని, అమెరికా ప్రజలు ట్రంప్‌ను దించి ఆ పని చేయాలని పిలుపునిచ్చారు.

## చర్చలు, దౌత్యానికే భారత్ మద్దతు



ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో గల్ఫ్ దేశాలపై దాడులు జరగడంపై ప్రధాని నరేంద్రమోదీ ఆందోళన వ్యక్తం చేశారు. గత 48 గంటల్లో ప్రధానమంత్రి 8 పశ్చిమాసియా దేశాల అధినేతలతో మాట్లాడారు. యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, జోర్డాన్, బహ్రెయిన్, ఒమన్, కువైట్, ఖతార్ నాయకులతో మాట్లాడారు. అటు కేంద్ర విదేశాంగ శాఖ కూడా ఆందోళ వ్యక్తం చేసింది. మరోవైపు పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితులను పర్యవేక్షించేందుకు ఓ బృందాన్ని కూడా ఏర్పాటు చేసింది.
మంగళవారం మధ్యాహ్నం ఒమన్ సుల్తాన్ హైతామ్ బిన్ తారిక్, కువైట్ యువరాజు షేక్ సబాహ్ అల్ ఖలేద్, ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీతో ప్రధాని ఫోన్‌లో మాట్లాడారు. ఒమన్, కువైట్? దేశాల్లో నివసిస్తున్న భారతీయుల సంక్షేమం, భద్రతా అంశాలపై ప్రధాని మోదీ చర్చించారు. గత రెండు రోజుల్లో మొత్తం 8 దేశాధినేతలతో చర్చలు జరిపారు. ఆయా దేశాల సార్వభౌమత్వం, భౌగోళిక సమగ్రతను ఉల్లంఘిస్తూ జరిగిన దాడులను ఖండించారు. ఈ క్లిష్ట సమయంలో భారత్ వారి ప్రజలతో ఐక్యతగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

**ఆందోళన వ్యక్తం చేసిన విదేశాంగ శాఖ**

అటు పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై విదేశాంగ శాఖ కూడా తీవ్ర ఆందోళ వ్యక్తం చేసింది. పవిత్ర రంజాన్ మాసంలో గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితి దిగజారడంపై ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రకటనను విడుదల చేసింది. ఘర్షణ మరింత తీవ్రరూపం దాల్చడంతో పాటు ఇతర దేశాలకు కూడా విస్తరించిందని తెలిపారు. విధ్వంసం, ప్రాణనష్టం పెరుగుతుండగా సాధారణ జీవనం, ఆర్థిక కార్యకలాపాలు స్తంభించాయని పేర్కొంది. అన్ని పక్షాలు సంయమనం పాటించాలని, ఉద్రిక్తతలు పెరగకుండా నివారించాలని, పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని భారత్? కోరినట్లు తెలిపింది. గల్ఫ్ ప్రాంత భద్రత, స్థిరత్వంలో కీలక వాటా కలిగిన సమీప పొరుగు దేశంగా ఈ పరిణామాలు తమకు ఆందోళన కలిగిస్తున్నాటని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. గల్ఫ్ ప్రాంతంలో దాదాపు కోటిమంది భారతీయులు ఉన్నారనీ వారి భద్రత, శ్రేయస్సుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించింది. భారతదేశ వాణిజ్యం, ఇంధన సరఫరా గొలుసులు ఈ ప్రాంతంపై ఆధారపడి ఉన్నాయన్న విదేశాంగశాఖ ఇక్కడి అంతరాయాలు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాలను చూపుతాయని తెలిపింది. వాణిజ్య ఓడలపై దాడులను ఖండిస్తున్నామని, ఇప్పటికే పలువురు భారతీయులు మృతిచెందారని వివరించింది. గత కొన్ని రోజుల్లో జరిగిన దాడుల్లో కొందరు భారతీయులు ప్రాణాలు కోల్పోయారని, మరికొందరు కనిపించకుండా పోయారని విచారం వ్యక్తం చేసింది.
ప్రస్తుత పరిస్థితుల్లో తక్షణమే చర్చలు,దౌత్యానికి తిరిగి రావాలని భారత్ బలంగా పునరుద్ఘాటించింది. ఘర్షణకు త్వరితగతిన ముగింపు పలకాలని కోరింది. ఇప్పటికే అనేక ప్రాణాలు కోల్పోయినందుకు సంతాపం వ్యక్తం చేసింది. ప్రభావిత దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లు అక్కడి భారతీయులతో, సంఘాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయని తెలిపింది. అవసరమైన సూచనలు, హెచ్చరికలు జారీ చేస్తున్నాయని, ఘర్షణ కారణంగా చిక్కుకుపోయిన వారికి సాధ్యమైన సహాయం అందిస్తున్నాయని పేర్కొంది. రాబోయే రోజుల్లో కూడా కాన్సులర్ సేవలను చురుకుగా కొనసాగిస్తామని స్పష్టం చేసింది.

**ప్రాంతీయ ప్రభుత్వాలతో సంప్రదింపులు**

ఈ ప్రాంత ప్రభుత్వాలతో పాటు ఇతర కీలక భాగస్వామ్య దేశాలతో భారత్ సంప్రదింపులు కొనసాగిస్తోందని తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి తమ సమకాలీనులతో చర్చలు జరిపారని వెల్లడించింది. పరిస్థితులను నిశితంగా గమనిస్తూ జాతీయ ప్రయోజనాల దృష్ట్యా తగిన నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొంది.

పశ్చిమాసియా పరిణామాలపై మంత్రిత్వ బృందం ఏర్పాటు
మరోవైపు పశ్చిమాసియాలో వేగంగా మారుతున్న పరిణామాలను నిశితంగా గమనించేందుకు అంతర మంత్రిత్వ బృందాన్ని (ఇంటర్ మినిస్ట్రీయల్ గ్రూపు) కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ బృందం ప్రతిరోజూ సమావేశమై పరిస్థితులను సమీక్షిస్తోందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్ మంగళవారం వెల్లడించారు.

## 60 ఏళ్ల భక్తుడు- ఏడాదిలో 11,000 కి.మీ నడక

మనం ఏడాదిలో మహా అయితే ఓ 10 లేదా 20 సార్లు గుడికెళ్తాం. వేరే జిల్లా, రాష్ట్రంలోని తీర్థయాత్రలకైతే ఇంకా తక్కువ సార్లే వెళ్తాం. అయితే మధ్యప్రదేశ్‌కు చెందిన 60 ఏళ్ల భక్తుడు ఏడాది వ్యవధిలో 400 గుడులను సందర్శించాడు. అందుకోసం 11,000 కి.మీలు నడిచాడు. అంతలా దైవ భక్తిని చూపించిన వ్యక్తి గురించి ఈ స్టోరీలో తెలుసుకుందాం.

**ఆరు పదుల వయసులో చలాకీగా**

సుందర్‌లాల్ స్వస్థలం విదిష జిల్లాలోని ఖేర్వా హాత్ గ్రామం. ఆయన దైవ భక్తుడు. ఏడాది వ్యవధిలో ఆయన అయోధ్య రామమందిరం, కాశీ సహా 400 గుడులను సందర్శించాడు. ఈ మతపరమైన తీర్థయాత్రలకు కాలినడకనే వెళ్తున్నాడు. 60 ఏళ్ల వయసులో కాళ్లు, మోకాలు నొప్పులతో చాలా మంది ఇంట్లో కూర్చొంటున్న సమయంలో సుందర్‌లాల్ మాత్రం అందుకు భిన్నం. ఆరు పదులు ఏజ్‌లోనూ యువకుడిలా నడుస్తూ దైవ దర్శనాలు చేసుకుంటున్నాడు.

**ఏ సీజన్ అయినా డోంట్ కేర్!**

వయసు పైబడినా పర్వతారోహణలు, ఎండ, చలితో సహా వివిధ వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటూ సుందర్‌లాల్ తన మతపరమైన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాడు. ఉత్తర హిమాలయ ప్రాంతాల కఠినమైన చలి అయినా, దక్షిణ భారతదేశంలోని మండే ఎండలైనా అతని ప్రయాణ వేగం ఎప్పుడూ తగ్గలేదు. అంతటి వయసులోనూ 11,000 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణం సుందర్‌లాల్ అజేయమైన సంకల్ప శక్తికి, దేవునిపై ఉన్న అచంచల విశ్వాసానికి నిదర్శనమని చెప్పొచ్చు. సుందర్‌లాల్ భక్తి ప్రయాణం ప్రాథమిక లక్ష్యం దేవాలయాలను సందర్శించడమే కాదు. దేశ ఐక్యత, సాంస్కృతిక వారసత్వాన్ని దగ్గర నుంచి పరిశీలించడం కూడా.

**అక్కడే బస**

అయితే ఇన్ని వేల కిలోమీటర్ల మతపరమైన పాదయాత్రలో సుందర్‌లాల్ ఒక్క రూపాయి కూడా ఎప్పుడూ ఖర్చు చేయలేదు. నడుస్తున్నప్పుడు దారి మధ్యలో భక్తులు, గ్రామస్థులు అందించే అహారాన్ని తింటాడు. అలాగే దేవాలయాలు, ధర్మశాలలు, సత్రాల్లో రాత్రివేళల్లో బస చేస్తాడు. సుందర్‌లాల్ ప్రతి రోజు ఉదయం 3-4 గంటలకు నడకను ప్రారంభిస్తాడు.

**'ఈ సుదీర్ఘ ప్రయాణాన్ని ఎప్పూడూ ఊహించలేదు'**

ఏడాది క్రితం తన మతపరమైన ప్రయాణం ప్రారంభమైందని సుందర్‌లాల్ తెలిపాడు. దేవుడిని ఆరాధించాలనే బలమైన కోరిక తనను ఇంటి నుంచి బయలుదేరడానికి ప్రేరేపించిందని వెల్లడించాడు. తాను ఇంత సుదీర్ఘ ప్రయాణం చేస్తానని ఎప్పుడూ ఊహించలేదన్నాడు. కానీ దేవుని దయ వల్ల అన్నీ సాధ్యమేనని అభిప్రాయపడ్డాడు. తనకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారని, వారి నుంచి తాను ఈ ప్రయాణం కోసం ఆర్థిక సహాయం తీసుకోలేదని స్పష్టం చేశాడు. ఈ ప్రయాణాన్ని పూర్తిగా దేవుడి మీద బారం వేసి కొనసాగిస్తున్నానని అన్నాడు.

## మౌనమే భారత ప్రతిష్ఠను తగ్గిస్తోంది

ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి లోక్?సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా సయ్యద్ అలీ ఖమేనీ హత్యపై కేంద్రం స్పందించాలని అన్నారు. ఈ విషయంలో మోదీ సర్కార్ మౌనం పాటించడం వల్ల ప్రపంచ వేదికపై భారత్?కు ఉన్న గౌరవం తగ్గిపోతుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు రాహుల్ గాంధీ ఎక్స్?లో పోస్ట్ చేశారు. 'ఈ ఘర్షణపై భారత్? నైతికంగా, స్పష్టంగా వ్యవహరించాలి. అంతర్జాతీయ చట్టాల పరిరక్షణ, మానవ ప్రాణాల రక్షణ కోసం స్పష్టంగా మాట్లాడే ధైర్యం మనకు ఉండాలి. మన విదేశాంగ విధానం సార్వభౌమత్వం, వివాదాలు శాంతియుత పరిష్కారంపై ఆధారపడి ఉంది. ఎప్పటికీ అదే విధంగా కొనసాగాలి. ప్రపంచ వ్యవస్థను నిర్వచించే మార్గంగా ఒక దేశాధినేత హత్యకు ప్రధానమంత్రి మద్దతు ఇస్తారా? ప్రధాని మోదీ ఈ విషయంలో మాట్లాడాలి. ఇప్పుడైనా మౌనం వీడాలి. ఈ మౌనం ప్రపంచంలో భారత ప్రతిష్ఠను తగ్గిస్తోంది' అని రాహుల్ గాంధీ అన్నారు.

**పశ్చిమాసియా ఉద్రిక్తతలపై రాహుల్ ఆందోళన**

అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య పెరుగుతున్న ఘర్షణలపై రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సున్నితమైన ప్రాంతాన్ని పెద్ద యుద్ధానికి దారి తీసే పరిస్థితి వైపు నెట్టివేస్తున్నాయని అన్నారు. భారతీయులతో సహా కోట్లాది మంది ప్రజలు ఈ అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. భద్రతాపరమైన ఆందోళనలు వాస్తవమే అయినప్పటికీ, సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించే దాడులు సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తాయని పేర్కొన్నారు. ఇరాన్?, ఇతర పశ్చిమాసియా దేశాలపై చేస్తున్న దాడులను ఖండించాల్సిందే అని చెప్పారు. ఇది మరింత హింసకు దారి తీస్తుందని తెలిపారు. సంభాషణ, సహనం మాత్రమే శాంతికి మార్గమని రాహుల్ గాంధీ అన్నారు.

**ప్రధాని మోదీ మౌనం వీడాలంటూ సోనియా వ్యాఖ్య**

ఖమేనీ లక్ష్యంగా చేసిన హత్యపై నరేంద్ర మోదీ ప్రభుత్వం మౌనం వహిస్తుందంటూ కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ కూడా స్పందించారు. మౌనంగా ఉండటం అనేది తటస్థ వైఖరి కాదని, పరాజయమని అన్నారు. అమెరికా-ఇజ్రాయెల్ చేపట్టిన భారీ దాడిని ప్రధాని మోదీ విస్మరించారని ఆరోపించారు. కేవలం యూఏఈపై ఇరాన్ ప్రతీకార దాడిని ఖండించడానికి మాత్రమే పరిమితమయ్యారని పేర్కొన్నారు. ఈ విషయంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రభుత్వానికి నిస్సందేహంగా మద్దతు ప్రకటించారని అన్నారు. హత్యకు కేవలం 48 గంటల ముందు ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటన నుంచి తిరిగి వచ్చారని తెలిపారు. నాలుగో రోజు కూడా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్? మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఇరాన్ అధికారిక మీడియా భవనం సహా క్షిపణులు, రాడార్ వ్యవస్థలే లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానికదాడులు చేశాయి. ఇక ఇరాన్?లో ఇప్పటి వరకు 787మంది మృతి చెందారు. ఇరాన్? కూడా ప్రతీకార దాడులు చేస్తూనే ఉంది. అమెరికా సైనిక స్థావరాలపై లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోంది. ఇదిలా ఉండగా హర్మూజ్? జలసంధిని మూసివేసినట్లు ప్రటించింది. మరోవైపు లెబనాన్ రాజధాని బీరుట్‌పై కూడా ఇజ్రాయెల్ వైమానిక దాడులను ఉధృతం చేసింది. తాజాగా భూతలదాడులు చేపట్టింది. హెజ్బొల్లా కమాండ్ సెంటర్‌తో సహా ఆయుధ నిల్వ కేంద్రాన్ని ధ్వంసం చేసింది. ఇజ్రాయెల్ వైమానిక స్థావరం దిశగా డ్రోన్లు ప్రయోగించినట్లు హెజ్బొల్లా తెలిపింది. ఇజ్రాయెల్ దురాక్రమణకు వ్యతిరేకంగా దాడులు కొనసాగుతాయని ప్రకటించింది. దాడులు ఆపకుంటే ప్రతీకారచర్యలు తీవ్రంగా ఉంటాయని హెజ్బొల్లా హెచ్చరించింది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు 52మంది మృతి చెందినట్లు లెబనాన్ ఆరోగ్య శాఖ తెలిపింది. మరో 154 మంది గాయపడ్డారని వెల్లడించింది.

## ఇరాన్ తాజాగా చర్చలకు ప్రయత్నించింది



యుద్ధం మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ తాజాగా తమతో చర్చలు జరిపేందుకు సిద్ధమైందని, కానీ అందుకు సమయం మించిపోయిందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య భీకర దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ విషయంపై స్పందించారు. "ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ (వాయు రక్షణ వ్యవస్థ), ఎయిర్ ఫోర్స్ (వాయుసేన), నేవీ (నావికాదళం) తుడిచిపెట్టుకుపోయాయి. ఇరాన్ నాయకత్వాన్ని తుదముట్టించాం. ఇప్పుడు వారు మాతో మాట్లాడాలని కోరుకుంటున్నారు. తాజాగా ఇరాన్ చర్చలు జరిపేందుకు ప్రయత్నించింది. దానికి నేను 'టూ లేట్' (ఇప్పటికే చాలా ఆలస్యమైంది) అని సమాధానమిచ్చాను" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. వాషింగ్టన్ పోస్ట్‌లో 'ట్రంప్ డాక్ట్రిన్' పేరుతో వచ్చిన ఒక విశ్లేషణాత్మక కథనానికి స్పందనగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం తీవ్ర స్థాయికి చేరుకోగా, అమెరికా సైనిక చర్యలు కొనసాగుతున్నాయి. ఇరాన్ సైనిక శక్తి, నాయకత్వం తీవ్రంగా నష్టపోయాయని, యుద్ధం మరికొన్ని వారాల పాటు కొనసాగే అవకాశం ఉందని ట్రంప్ అంచనా వేశారు. అమెరికా సైనిక శక్తి తిరుగులేనిదని ఆయన ఎం పునరుద్ఘాటించారు.

## సర్కార్ ఇచ్చిన సొమ్ము 'గుడి' నిర్మాణం కోసం ఇచ్చేసిన మహిళలు

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయడానికి ఆ గ్రామ మహిళలంతా ఒకే తాటిపైకి వచ్చారు. ప్రభుత్వం 'గృహలక్ష్మి పథకం' కింద తమ ఖాతాల్లో జమ చేస్తున్న నగదులో కొంత ఊరి దేవత గుడి కోసం విరాళంగా ఇచ్చి తమ భక్తిని చాటుకున్నారు. ఓ వైపు గ్యారెంటీ పథకాల వల్ల రాష్ట్ర ఖజానాపై భారం పడుతోందని విమర్శలు వస్తున్న తరుణంలో, గృహలక్ష్మి స్కీమ్? ద్వారా వచ్చిన డబ్బుతో ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు కర్ణాటకకు చెందిన మహిళలు. ఇంతకీ వీరు ఈ నిర్ణయం తీసుకోవడం వెనుకున్న కథేంటో ఇప్పుడు చూద్దాం.
విరాళంగా గృహలక్ష్మి స్కీమ్? డబ్బులు
కర్ణాటక, గదగ్ తాలూకాలోని తిమ్మాపుర గ్రామంలో నాలుగు సంవత్సరాల క్రితం రేణుక ఎల్లమ్మ తల్లి రాతి ఆలయాన్ని నిర్మించాలని అక్కడి గ్రామస్థులు నిశ్చయించుకున్నారు. ఈ క్రమంలో గ్రామస్థులంతా కలిసి సమష్టిగా ఓ ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. ఆలయ నిర్మాణానికి మొత్తంగా సుమారు కోటి రూపాయల ఖర్చు అవుతుందని అంచనా వేసుకున్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ నుంచి నైపుణ్యం కలిగిన శిల్పులను పిలిపించి నిర్మాణ పనులు అప్పగించారు. అయితే, ప్రారంభ దశలో గ్రామస్థులే దాదాపు 50 లక్షల రూపాయల విరాళాలు సేకరించారు. వీటితో ఆలయ పునాదులు, గోడ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అనంతరం, ఆర్థిక ఇబ్బందులు, అదనపు ఖర్చుల కారణంగా ఆలయ నిర్మాణ పనులు కొంతకాలం ఆగిపోయాయి. పనులు పూర్తి కావడానికి ఇంకా రూ.50 లక్షల కావాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఆలయ కమిటీ, గ్రామస్థులు ప్రత్యామ్నాయ నిధుల కోసం అన్వేషించారు. ఈ నేపథ్యంలో గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ద్వారా స్వచ్ఛంద విరాళాలు సేకరించాలని అభిప్రాయపడ్డారు. గృహలక్ష్మి పథకం ద్వారా వచ్చిన డబ్బును స్వచ్ఛందంగా విరాళాల రూపంలో ఇవ్వాలని మహిళలను అభ్యర్థించారు ఆ గ్రామస్థులు. దానికి వారు కూడా ఒప్పుకున్నారు. అనంతరం ఆలయ నిర్మాణం కోసం గ్రామంలోని మహిళలు తమ డబ్బులను విరాళంగా ఇవ్వడం ప్రారంభించారు.తిమ్మాపూర్ గ్రామంలో దాదాపు 850 మంది గృహలక్ష్మి లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో దాదాపు 100 మంది మహిళలు ఇప్పటికే విరాళాలు అందించారు. మొత్తంగా రూ.2.5 లక్షలు సేకరించడం జరిగింది.

## సంపాదకీయం

# యుద్ధ అంచున నిలిచిన ప్రపంచం!

పశ్చిమాసియాలో మళ్లీ సంగ్రామ మేఘాలు కమ్ముకొంటున్నాయి. “ఆపరేషన్ ఎపిక్ ఫూరీ” పేరుతో కొనసాగుతున్న అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్త సైనిక చర్యలు, వాటికి ప్రతిస్పందనగా ఇరాన్ చేసిన ప్రతిఘటన ప్రకటనలు, ఐక్యరాజ్య సమితి భద్రతామండలి అత్యవసర సమావేశం ఈ సమస్త పరిణామాలు ప్రపంచ రాజకీయ రంగాన్ని కుదిపేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశ రక్షణకు ముప్పు కలిగించే శక్తులను అడ్డుకోవడంలో వెనుకాడబోమని స్పష్టం చేయగా, ఇరాన్ విదేశాంగ మంత్రి హుస్సేన్ అమీరాబాద్ డొల్లాహియన్ తమ దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడంలో ఎటువంటి రాజీ ఉండదని ఘాటుగా ప్రకటించారు. మాటల స్థాయిలో ప్రారంభమైన ఈ ప్రతిస్పందనలు క్రమంగా సైనిక కదలికల రూపంలోనూ వ్యక్తమవుతు న్నాయి. ఈ ఉద్రిక్తతకు ప్రధాన కారణంగా ఇరాన్ అణు కార్యక్రమాన్ని అమెరికా, ఇజ్రాయిల్ పేర్కొంటున్నాయి. 2015 సంవత్సరంలో కుదిరిన ఉమ్మడి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక ఒప్పందం ప్రకారం ఇరాన్ అణు శక్తి అభివృద్ధిని నియంత్రించేందుకు అంతర్జాతీయ పర్యవేక్షణకు అంగీకరించింది. అయితే ఆ ఒప్పందం నుంచి అమెరికా వైదొలిగిన తర్వాత అనుమానాలు మళ్లీ పెరిగాయి. ఇరాన్ యురేనియం శుద్ధీకరణ స్థాయిని పెంచుతోందన్న ఆరోపణలతో ఇజ్రాయిల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తమ భద్రతకు ప్రత్యక్ష ముప్పు ఏర్పడుతుందనే భావనతో ఇజ్రాయిల్ ఇరాన్‌లోని కొన్ని అణు కేంద్రాలపై గగనతల దాడులు నిర్వహించినట్లు వార్తలు వెలువడ్డాయి. అమెరికా కూడా ఈ చర్యలకు మద్దతు తెలుపుతున్నదనే అభిప్రాయం బలపడుతోంది. ఇరాన్ మాత్రం తన అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత అవసరాలకేనని, విద్యుత్ ఉత్పత్తి మరియు శాస్త్రీయ పరిశోధనల కోసమేనని స్పష్టం చేస్తోంది. అంతర్జాతీయ అణుశక్తి పర్యవేక్షణ సంస్థ పర్యవేక్షణలోనే తమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పేర్కొంటోంది. అయితే ఇజ్రాయిల్ దృష్టిలో ఇరాన్ అణు సామర్థ్యం భవిష్యత్తులో ప్రాణాంతక ముప్పుగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అమెరికా?ఇజ్రాయిల్ చర్యలు రక్షణాత్మక చర్యలేనని వారు వాదిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అత్యవసర సమావేశం నిర్వహించి తక్షణ సంగ్రామ విరమణకు పిలుపునిచ్చింది. చర్చల ద్వారానే సమస్య పరిష్కారం సాధ్యమని సభ్యదేశాలు అభిప్రాయ పడ్డాయి. రష్యా, చైనా వంటి దేశాలు ఈ దాడులను తీవ్రంగా ఖండించగా, యూరోపియన్ దేశాలు పరిస్థితి అదుపు తప్పకూడదని హెచ్చరించాయి. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి శాంతి సాధనకే ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అయితే భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాల మధ్య ఉన్న విభేదాలు ఏకాభిప్రాయ నిర్ణయానికి అడ్డంకిగా నిలుస్తున్నాయి. గల్ఫ్ ప్రాంత దేశాలు అత్యవసరంగా సమావేశ మవడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియ జేస్తోంది. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్, కువైట్ వంటి దేశాలు తమ భూభాగం సంగ్రామ రంగంగా మారుతుందేమోనని ఆందోళన చెందుతున్నాయి. హోర్ముజ్ సముద్ర మార్గం ప్రపంచ చమురు రవాణాకు కీలక జీవనాధారం. ప్రపంచ చమురు సరఫరాలో పెద్ద భాగం ఈ మార్గం ద్వారా సాగుతుందని అంచనాలు చెబుతున్నాయి. అక్కడ సైనిక ఘర్షణలు ఉధృతమైతే ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది. ఇప్పటికే చమురు ధరల్లో పెరుగుదల సూచనలు కనిపిస్తున్నాయి. జర్మనీ, బ్రిటన్ వంటి దేశాలు అమెరికాకు మద్దతుగా నిలిచే అవకాశమున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. అయితే ప్రత్యక్ష సైనిక ప్రవేశంపై యూరోపియన్ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. మరోవైపు రష్యా, చైనా ఈ దాడులను ఆధిపత్య రాజకీయాల ప్రతిబింబంగా విమర్శిస్తున్నాయి. ఉక్రెయిన్ సంగ్రామం కారణంగా ఇప్పటికే పాశ్చాత్య దేశాలతో విభేదాలు ఉన్న రష్యా, ఈ సందర్భాన్ని వ్యూహాత్మకంగా వినియోగించుకునే అవకాశముంది. మూడవ ప్రపంచ సంగ్రామం సంభవిస్తుందా అన్న ప్రశ్న ఇప్పుడు గంభీరంగా వినిపిస్తోంది. ఒకవేళ అమెరికా ఇజ్రాయిల్ యూరోపియన్ దేశాలు ఒకవైపు, ఇరాన్‌కు మద్దతుగా రష్యా?చైనా మరోవైపు నిలిస్తే ప్రపంచం రెండు శిబిరాలుగా విడిపోయే ప్రమాదం ఉంది. ఆధునిక సంగ్రామ స్వరూపం కేవలం భూయుద్ధంతో పరిమితం కాదు. క్షిపణి దాడులు, మానవ రహిత యంత్ర వాహనాల వినియోగం, సమాచార యుద్ధం, ఉపగ్రహ వ్యవస్థల విధ్వంసం, ఆర్థిక ఆంక్షలు?ఇవన్నీ సమాంతరంగా జరుగుతాయి. అణు ఆయుధాల వినియోగం అనే భయానక అంశం ప్రపంచాన్ని కుదిపేస్తోంది. అణు సంగ్రామం జరిగితే మానవజాతి, పర్యావరణం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తిరుగులేని నష్టం సంభవిస్తుంది. ప్రపంచ ఇంధన మార్కెట్లపై ఈ సంగ్రామ ప్రభావం అత్యంత తీవ్రమైనదిగా ఉంటుంది. చమురు ధరలు పెరిగితే రవాణా వ్యయం, ఉత్పత్తి వ్యయం పెరుగుతాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు ద్రవ్యోల్బణంతో ఇబ్బందులు ఎదుర్కొంటాయి. అంతర్జాతీయ వాణిజ్యం మందగిస్తుంది. మూలధన ప్రవాహాలు క్షీణిస్తాయి. ఈ ప్రభావాలు సంగ్రామంలో ప్రత్యక్షంగా పాల్గొనని దేశాలకూ తాకుతాయి. భారత దేశానికి ఈ సంక్షోభం నుంచి మినహాయింపు ఉండదు. భారత్ తన చమురు అవసరాల్లో గల్ఫ్ దేశాలపై ఎక్కువగా ఆధార పడుతోంది. చమురు ధరల పెరుగుదల భారత ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచుతుంది. విదేశీ మారక నిల్వల వినియోగం పెరుగుతుంది. గల్ఫ్ ప్రాంతంలో పనిచేస్తున్న లక్షలాది భారతీయుల భద్రత ప్రశ్నార్థక మవుతుంది. అవసరమైతే వారిని సురక్షితంగా తరలించాల్సిన పరిస్థితి తలెత్తవచ్చు. ఎరువులు, సహజ వాయువు, పెట్రో ధరలను రసాయనాల సరఫరాపై కూడా ప్రభావం పడుతుంది. ఇరాన్ అంతర్గత పరిస్థితులు కూడా ఈ సంగ్రామ వాతావరణంతో సంక్లిష్టంగా మారుతున్నాయి. ఆర్థిక ఆంక్షలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశానికి సైనిక ఒత్తిడి మరింత భారంగా మారుతుంది. అయితే విదేశీ దాడులు దేశంలో జాతీయత భావాన్ని పెంచి ప్రభుత్వానికి మద్దతు కూడగట్టే అవకాశమూ ఉంది. అమెరికా?ఇజ్రాయిల్ చర్యలను తమ సార్వభౌమాధికారంపై దాడిగా చిత్రీకరిస్తూ ఇరాన్ ప్రజలను సమీకరించే ప్రయత్నం జరుగుతోంది. సమగ్రంగా పరిశీలిస్తే ఈ సంక్షోభం కేవలం ప్రాంతీయ ఘర్షణ మాత్రమే కాదు; ప్రపంచ శక్తి సమీకరణాలను ప్రభావితం చేసే పరిణామం. అణు వ్యాప్తి నిరోధక విధానాల భవిష్యత్తు, అంతర్జాతీయ దౌత్య వ్యవస్థ విశ్వసనీయత, ఇంధన భద్రత? ఈ అంశాలన్నీ దీనితో ముడిపడి ఉన్నాయి. మూడవ ప్రపంచ సంగ్రామం అనేది అత్యంత దుర్భర పరిణామం. అది జరిగితే మానవ నాగరికతకే ముప్పు. అందువల్ల ప్రపంచ నాయకులు వివేకంతో వ్యవహరించి చర్చల ద్వారానే శాశ్వత శాంతిని సాధించాలి. శక్తి ప్రదర్శన కంటే పరస్పర గౌరవం, ప్రతీకారం కంటే సంభాషణ, ఆధిపత్యం కంటే సహకారం ఇవే స్థిరమైన శాంతికి మార్గదర్శకాలు. ప్రపంచం యుద్ధ అంచున నిలవకుండా, శాంతి మార్గంలో ముందుకు సాగాలని మానవజాతి ఆకాంక్షిస్తోంది.

# అనితర సాధ్యం... బులుసు త్యాగం

దేశ స్వాతంత్ర్య పోరాటంలో సర్వం త్యాగం చేసిన ఒక చిత్తశుద్ధి, అంకిత భావం, నిజాయితీ గల వ్యక్తి తీవ్ర నిరాదరణకు గురైన విషయం చాలా మందికి తెలియనిది. ఒక రాష్ట్రం ఏర్పాటు కోసం కృషి చేసిన నేతను రాష్ట్రం ఏర్పడిన సందర్భంలో ఆయన అహ్వానింప బడని బాధాకరమైన నేపథ్యం ఉంది. రాష్ట్ర శాసన సభాపతిగా పని చేసిన ఓ నేత స్వాతంత్ర్య సమర యోధుల పెన్షన్ పొందలేని దుస్థితికి, తిండిలేక భిక్షాటనం చేసిన హృదయ విదారక సన్నివేశాలకు ఆంధ్ర రాష్ట్ర చరిత్ర మౌన సాక్షీభూతంగా నిలిచి ఉంది. కాంగ్రెస్ పార్టీ, స్వాతంత్ర్యానికి ముందు, అధిక శాతం దేశభక్తుల, త్యాగ ధనుల పార్టీగా వుండేది. అలాంటి నిస్వార్థ త్యాగాల భాగ స్వామ్య ఫలితంగానే స్వాతంత్ర్య సాధన సాధ్యమైంది. చెట్టు పేరు చెప్పుకుని కాయలు అమ్ముకునే నేటి నాయకుల లాగా కాకుండా, స్వాతంత్ర్య సాధనకు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని, ఎన్నో రకాలుగా లక్ష్య సాధనలో సకలం ఫణంగా పెట్టి పోరాడిన వారెందరో. లక్ష్య సాధన జరిగాక, నిర్లక్ష్యానికి గురైన వారింకెందరో. అలాంటి వారిలో అగ్రగణ్యుడు... బులుసు సాంబమూర్తి. సుఖమయ జీవితా న్ని గడపడానికి అన్ని అవకా శాలు అంది పుచ్చుకుని కూడా, దేశ స్వాతంత్ర్యం కోసం సర్వం త్యాగం చేసిన త్యాగధనుడు, అసలు సిసలైన దేశభక్తుడు బులుసు సాంబమూర్తి. స్వాతంత్ర్యోద్యమంలో ఆయన పాత్ర మరచి పోలేనిది. మహాత్మా గాంధీ కన్నా ముందుగానే కొల్లాయి కట్టి సామాన్య ప్రజలతో మమేక మైన నిస్వార్థ సేవా పరాయణుడు బులుసు సాంబమూర్తి అని, ఈతరం వారికి తెలియకపోవచ్చు. ఆయన తూర్పు గోదావరి జిల్లా, దుళ్ల గ్రామంలో 1886, మార్చి 4 న జన్మించారు. ఆయన తండ్రి సుబ్బావధానులు వేదపండితులు. కుటుంబమంతా దానధర్మాలు చేస్తూ ధార్మిక జీవనం సాగించే వారు. మద్రాసు విశ్వ విద్యాలయం నుండి బి.ఏ. పరీక్షలో ఉత్తీర్ణులై, విజయనగరం మహారాజా కళా శాలలో కొంతకాలం భౌతిక శాస్త్రం బోధించారు. స్వేచ్ఛా స్వభావి అయిన సాంబమూర్తికి ఈ ఉద్యోగం అంతగా నచ్చలేదు. ఉద్యోగానికి రాజీనామా చేసి న్యాయవాద వృత్తి చేపట్టాలని నిర్ణయించు కున్నారు. బి.ఎల్. పరీక్షలో ఉత్తీర్ణులై 1911లో కాకినాడలో న్యాయవాద వృత్తిని స్వీకరించి, మహాత్ముని పిలుపు నందుకొని న్యాయవాద వృత్తిని వదలి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. 1919లో హోంరూల్ ఉద్యమంలోను, 1930లో ఉప్పు సత్యాగ్రహంలోను, 1932లో శాసనో ల్లంఘన ఉద్యమంలో, 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో, పలు సత్యాగ్రహాలలో పాల్గొని కారాగార శిక్షలు అనుభవించారు. 1927లో నాగపూరు పతాక సత్యాగ్రహ దళానికి నాయకులుగాను, 1928 లో హిందూస్థానీ సేవా దళానికి అధ్యక్షులుగా పని చేశారు. తరువాత తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెసు కమిటీకి అధ్యక్షులుగా, 1929లో అఖిల భారత కాంగ్రెసు కమిటీలో సభ్యులుగా వ్యవహ రించారు. 1930 ఉప్పు సత్యాగ్రహ సమయంలో తన సహచరులతో చొల్లంగి సముద్ర తీరానికి వెళ్ళి ఉప్పును తయారు చేశారు. సాంబ మూర్తిని అరెస్టుచేసి వెల్లూరు జైలు కు తరలించారు. 1935-37 మధ్య కాలంలో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీ కార్యదర్శిగా వ్యవహ రించారు. 1935లో మద్రాసు ప్రోవిన్షియల్ ఎస్సెంబ్లీకి జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి నప్పుడు, చక్రవర్తి రాజగోపాలాచారి ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. సాంబమూర్తి 1937 నుంచి 1942 వరకూ స్పీకరుగా ఉన్నారు. 1937లో కాంగ్రెసు మంత్రివర్గ పరిపాలనలో మద్రాసు రాష్ట్ర శాసనసభకు సభాపతిగా విధులను సంప్రదా యాలకు అనుగుణంగా, మర్యా దగా, అద్వితీయంగా నిర్వహించి సభకు గౌరవ ప్రతిష్ఠలను సమకూర్చారు. 1923 లో అఖిల భారత కాంగ్రెస్ మహాసభ కాకినాడలో మూడు రోజులపాటు నిర్వహించిన సభకు దేశంలోని ప్రముఖ కాంగ్రెస్ నాయకులు రాగా, ఆహ్వాన సంఘ అధ్యక్షులుగా దేశభక్త కొండ వెంకట ప్పయ్య, కార్యదర్శిగా ఉండగా, ఆ సమయంలోనే సాంబమూర్తి ఏకైక కుమారుడు మరణించాడు. అయినా ఏ విధమైన అసౌకర్యం కలగకుండా అద్భుతమైన బులుసు బాధ్యతగా ఏర్పాట్లు చేసారు. జరిగిన విషాదం తెల్సుకున్న గాంధీజీ ఆ సభ సెషన్ ను ఆపేశారట. భారత కోకిల సరోజినీ నాయుడు సాంబ మూర్తి స్థిత ప్రజ్ఞతకు చలించి అప్పటి కప్పుడు ఆ సభలో ఆశువుగా గీతాన్ని ఆలపించారట. ఉప్పు సత్యాగ్రహ సమయంలో ఉప్పు మీద పన్ను ఎత్తివేసే వరకు ఆహారంలో ఉప్పు వేసుకోనని ప్రతిజ్ఞ చేయడాన్ని బట్టి అయన వ్యక్తిత్వం అర్థం అవుతుంది. 1937లో మద్రాసు రాష్ట్ర శాసనసభకు స్పీకర్ గా ఎన్నికై, పని చేసి, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనేందుకు ఆ పదవి వదులు కున్న దేశభక్తులు బులుసు. చెన్నపట్నంలో ఆంధ్ర మహాసల ఏర్పాటులో చురుకైన పాత్ర పోషిం చటమే కాక తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలన్న ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించారు. తెలుగు రాష్ట్ర ఏర్పాటును రాజాజీ, నెహ్రూ వ్యతిరేకించారు. పొట్టి శ్రీరాములు నిరాహార దీక్షకు సిద్ధమైతే, ఆయన ను తన ఇంటినే వేదికగా చేసుకో మన్న నాయకుడు సాంబ మూర్తి, అమరజీవి ప్రాణత్యాగం చేసిన ఆ ఇంటిని స్మారక భవనంగా వదిలి కాకినాడకు చేరిన త్యాగమూర్తి బులుసు సాంబమూర్తి. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డాక, కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్ర అవతరణకు నెహ్రూ విచ్చేసినా, కాంగ్రెస్ నాయకులు నెహ్రూకు భయపడి బులుసు సాంబమూర్తికి కనీసం ఆహ్వానం కూడా పంపని నాటి కాంగీయుల వ్యవహార శైలి బులుసుకు చేసిన అవమానికి, నిర్లక్ష్యానికి, నిరాదరణకు పరాకాష్ట. దేశస్వాతంత్ర్యం కోసం ఆదాయం ఇచ్చే న్యాయవాద వృత్తిని ఆయన వదులు కున్నారు. ఆంధ్రరాష్ట్రం కోసం మద్రాసులో తన ఇల్లు వదులు కున్నారు. స్వాతంత్ర్యం వచ్చింది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. కానీ బులుసు లాంటి త్యాగమూర్తి ఒంటరివారయ్యారు. భార్య గతించింది. ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. ఇక మద్రాసులో నివాసం అనవసరంగా భావించి, సొంత ఊరు కాకినాడ చేరితే జీవితం బాగుపడుతుందని అనుకున్నారు. ఆయన నమ్ముకున్న కాకినాడలో పరిస్థితులు మరింతగా మారి పోయాయి. ఒకప్పుడు మహర్షి అని గుర్తింప బడి, ఆయన దర్శనం కోసం వెళుతున్నామని నలుగురిలో చెప్పుకుని బులుసు గారింటికి వెళ్ళటం గొప్పగా భావించిన కాంగ్రెస్ వాదులు, మహర్షి ఎదురుగా కనిపించినా పట్టించు కోని దుస్థితి. ఒకప్పుడు ఆయన్ని ఆరాధించిన వారే ముఖం చాటేశారు. ఆయన ఉన్నత స్థితిలో ఉన్నప్పుడు అన్నిరకాలుగా సహాయం పొందిన వారు, సాంబమూర్తి ఎదురు పడితే డబ్బులు అడుగుతాడని తప్పుకుని తిరిగారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డాక, సాంబమూర్తికి వయసు మీద పడింది. పేదరికం వెంటాడింది. వేళకు తినలేని పరిస్థితి. ఆదుకునే వారు లేకుండా పోయారు. ఒకనాడు కాకినాడ వీధుల్లో ఖరీదైన వాహనం మీద లాయర్ గా తిరిగిన సాంబమూర్తి చివరి రోజుల్లో అదే వీధుల్లో కంటి చూపు మందగించి, కాళ్ళకు సరైన చెప్పులు లేక చిరిగిన దుస్తులతో, చేతికర్ర సహాయంతో తిరుగుతూ భిక్షాటనం చేయాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రతిరోజూ సాయంత్రం వేళ దేవాల యాల దగ్గర సమయం గడిపే వారు. దేవాలయాలమ దర్శించి అక్కడి ప్రసాదాలతో కడుపు నింపుకున్నారు. కొన్ని సందర్భా లలో దేవాలయం ముందు బిచ్చగాళ్ళతో చేరి క్షుద్బాధ భరించ లేక చేతులు చాపాడని అంటారు. ఆర్థిక సహాయం కోసం ప్రభుత్వానికి అర్జీ పంపితే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం నుండి... బులుసు సాంబమూర్తి అనే ఆయన స్వాతంత్ర్య సమర యోధుడు అనేందుకు తగిన ఆధారాలు ప్రభుత్వ రికార్డులలో లేవని సమాధానం వచ్చిందట. దేశం, నాయకులు విస్మరించిన దేశభక్తుల జాబితాలోని ఒక ప్రముఖుడు మహర్షి బులుసు సాంబమూర్తి. పేదరికంలో మగ్గుతున్న సాంబ మూర్తి గురించి తెలుసుకున్న నాటి కేంద్ర హోమ్ శాఖ మంత్రి గోవింద్ వల్లభ్ పంత్ మాత్రమే ఆర్థిక సహాయం అందించారని, రాష్ట్ర నేతలు పట్టించుకోలేదని చెపుతారు. పేదరికం దానికి తోడు మానసిక వ్యథ తోడు కాగా చివరికి 1958 ఫిబ్రవరి 3న కాకినాడలోనే బులుసు సాంబమూర్తి అంతిమ శ్వాస విడిచారు.

# ‘కుమ్మెర’ లేవనెత్తుతున్న ప్రశ్నలు

భారత రాజ్యాంగం సమానత్వం అనే మహోన్నత విలువలపై నిర్మించబడింది. ఆ పునాదులకు రూప శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్. కానీ ఇప్పటికీ రాజ్యాంగం ఆశించిన సమానత్వం ఆమడదూరంలోనే ఉన్నది. అయితే, హిందువులంతా బంధువులమనే భారతీయ సమాజంలో దేవాలయం దగ్గర కులం పేరుతో జరిగిన దాడి మరోమారు హిందు ధర్మంలో అసమానతలను నొక్కిచెబుతున్నది. ఇదీ హిందుత్వానికి మాయనిమచ్చ. ఇటీవల నాగర్ కర్నూలు జిల్లా, కుమ్మెర గ్రామంలో మల్లన్న స్వామి జాతరలో బిసి చాకలి కుటుంబంపై జరిగిన దాడి దేశాన్ని కుదిపేస్తుంది. రెండు నెలల పసిబిడ్డను అత్యంత క్రూరంగా కాలితో తన్ని హత్య చేసిన ఆ గ్రామ అగ్రకుల పెత్తందారుల ఆధిపత్యం మానవత్వానికి మచ్చగా మిగిలింది. ఒక శిశువు ప్రాణం కుల అహంకారానికి బలి కావడం కేవలం నేరమే కాదు, అది మానవత్వంపై జరిగిన దాడి. దేవాలయ ప్రవేశం, ఆధ్యాత్మిక హక్కుల విషయంలో సబ్బండ కులాలపై వివక్ష- ఆధునిక భారతదేశంలోనూ బహిర్గతమవుతుంది. శివుని సమానత్వానికి ప్రతిరూపమైన మల్లన్న దేవుడి గుడిలో జరిగిన ఘటన అనేక ప్రశ్నలను లేవనెత్తుతుంది. ఇది కేవలం ఒక గ్రామ సమస్య కాదు, ఆధ్యాత్మిక నిర్మాణంలో దాగి ఉన్న అసమానతలకు ప్రతిబింబంగా నిలిచింది. ఈ అన్యాయంపై మొట్టమొదట గళమెత్తిన నాయకుడు బిసి, ఎస్సి, ఎస్టి ఎస్టీల విముక్తి ఉద్యమ రథసారధి డాక్టర్ విశారదన్ మహరాజ్. ఆయన హిందూ ధర్మంలో బిసి, ఎస్సి, ఎస్సిల వాటా ఎంత? అని వేసిన ప్రశ్న పలువురుని ఆలోచింపచేస్తుంది. ప్రపంచానికే విద్య, విజ్ఞానం, సంస్కృతి పంచిన గొప్ప దేశం మనది. ‘హిందువులంతా బంధువులు అనే నినాదం మహోన్నతమైన ది. కానీ ఆ నినాదం వాస్తవ జీవితంలో ప్రతిబింబిస్తుందా? అనేది ప్రశ్నార్థకమే! కుమ్మెర గ్రామ ఘటన దీనికి సజీవ సాక్ష్యం. వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న వర్ణ-కుల వ్యవస్థ ఈ దుర్ఘటనకు మూలకారణం. మేమే అధిపతులం అనే మనస్తత్వం పెరిగి, అది బలహీనులపై బలవంతుల దౌర్జన్యానికి పురిగొల్పుతున్నది. దీంతో ప్రజాస్వామ్య ఆలోచనలను పాతరేస్తూ ప్రతిచోట కులస్వామ్య కోరలు రాజ్యమేలుతున్నాయి. ఇదీ దేవాలయాల నిర్వహణ కమిటీలో, పీఠాధిపతుల్లో, ప్రధాన పూజారి స్థానాల్లో, ఆధ్యాత్మిక నిర్ణయ కేంద్రాల్లోనూ స్ఫురిస్తోంది. ఈ ఆధ్యాత్మక ప్రదేశాలలో అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం లేకపోవడమే ఈ ఆధిపత్యానికి నిదర్శనం. ఏ దేవుడైన సమానత్వం బోధిస్తాడు. కానీ అగ్రకులాలు ఆధిపత్యం ఒక వ్యవస్థను నిర్మించుకొని బిసి, ఎస్సి, ఎస్టిలను శూద్రులుగా, బానిసలుగా చూస్తున్నారు. అయినా దళిత, బహుజనులు హిందువులంతా బంధువులుగానే భావించుకుంటూ వేల సంవత్సరాలుగా హిందూ మతాన్ని కాపాడుతున్నారు. చారిత్రకంగా వారికి ఆయుధం, భూమి, సంపద, విద్య వంటి ప్రధాన వనరులపై సమాన హక్కులు లభించలేదు. ఈ సామాజిక కట్టుబాట్లు, అసమానతల వల్ల దేశ రక్షణ, ఆర్థిక స్థితి, సామాజిక ఐక్యత దెబ్బతిన్నది. ఉదాహరణకు భారతీయ హిందురాజు పృథ్వీరాజ్ చౌహాన్ కాలంలో జరిగిన తరైన యుద్ధాలలో మహమ్మద్ గోరి భారతదేశాన్నీ ఆక్రమించాడు. ఈ యుద్ధంలో బహుజనుల భాగస్వామ్యం లేకపోవడం వలన దేశం ఆక్రమణకు గురైంది. వారి చేతిలో అధికారం ఉండి ఉంటే ఎవరు కూడా కన్నెత్తి చూసే సాహసం చూపేవారు కాదు. ఇప్పటికీ భారతదేశంలో కొన్ని కులాల చేతిలో అధికారం కేంద్రీకృతం కావడం వల్లనే అభివృద్ధి సాధించలేక పోతుంది. దీనికి ప్రధాన కారణం హిందూమతంలోని బిసి, ఎస్సి, ఎస్టిలకు అధికారం ఇవ్వకపోవడమే. నేటికీ గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు హిందు ధార్మిక కార్యక్రమాలలో అగ్రకులాధిపత్యం రాజ్యమేలు తుందనడానికి కుమ్మెర ఘటన మనకు ఒక గట్టి హెచ్చరిక. ఇది ఆధునిక భారత దేశంలో మానవ హక్కుల ఉల్లంఘన. దేవాలయం ఒక వర్గం సొత్తు కాదు, భక్తి కులాన్ని అడగదని, దేవుడు జాతి పత్రం చూడడు అనే మాటలు ‘ఆదర్శాలు’ గానే మిగులుతు న్నాయి. రోజురోజుకు భయంకరమైన కులం కుట్రలు చాపకింద నీరులా విజృంభిస్తున్నాయి. వెనుకబడిన కులాలను తమ ఆధీనంలో ఉంచుకోవాలనే ఆధిపత్య పోకడలు కొనసాగున్నాయి. ఇప్పటికీ అక్కడక్కడ గ్రామాల్లో అట్టడుగు కులాల ఆలయ ప్రవేశాన్నీ అడ్డుకోవడం, సామాజికంగా బహిష్కరించడం వంటి ఘటనలు వెలుగులోకి వస్తుండడం ఇందుకు ఉదాహరణ. అదేవిధంగా ఆ వర్గాలు రాజ్యాంగం కల్పించిన అధికారాన్ని కూడా చెలాయించడాన్ని ఓర్చుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో కుమ్మెర ఘటనలో డాక్టర్ విశారదన్ పోరాటం హిందు స్వాభిమానానికి, మానవ గౌరవానికి, రాజ్యాంగ ఆత్మకు సంబంధించిన పోరాటంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఆయన నికార్సయిన పోరాటానికి పలువురు సామాజిక ఉద్యమకారులు, మేధావులు, రాజకీయ పార్టీలు మద్దతిస్తున్నాయి. సమాజం ముందుకు వెళ్లాలంటే అగ్రకులాలు ఆధిపత్య భావాలను విడిచిపెట్టి ప్రజాస్వామ్య గణతంత్ర విలువలను గౌరవించాలి. రాజ్యాంగ సమానత్వం పేజీల్లో మాత్రమే కాకుండా ఆలయ గర్భగుడిలోనూ, మన హృదయాల్లోనూ ప్రతిఫలించాలి. ఇందుకై సంస్థాగత మార్పులు అవసరం. దేవాలయాల నిర్వహణలో సమాన ప్రాతినిధ్యం కావాలి. కుల ఆధారిత అహంకారాన్ని సామాజికంగా ఖండించే ధైర్యం ప్రతి ఒక్కరిలో రావాలి. కుమ్మెర గ్రామ ఘటనలో చాకలి కుటుంబంపై దాడి చేసిన నిందితుల్ని వెంటనే శిక్షించి బాధితులకు న్యాయం చేయాలి. ఆధ్యాత్మిక ప్రపంచంలో అణగారిన వర్గాలను భక్తులుగా మాత్రమే చూడడం సరికాదు. వారికి నాయకత్వం, నిర్ణయాధికారం, గౌరవప్రదమైన ప్రాతినిధ్యం లభించినప్పుడే హిందువులంతా బంధువులు అవుతారు. అదే విధంగా అట్టడుగు వర్గాలు కేవలం భక్తులుగా మిగిలిపోతే సరిపోదు. శివుని సామాజిక సమానత్వం, సమ్మక్క-సారలమ్మల, చాకలి ఐలమ్మల పోరాటంబాటలో నడిచినప్పుడే ఆధిపత్యం అంతమవుతుంది. అప్పుడే రాజ్యాంగం కోరుకున్న సమానత్వం అమలవుతుంది. లేదంటే బిసి, ఎస్సి, ఎస్టిలు అంధభక్తులుగా మిగిలి, ఆధిపత్య వర్గాల చేతుల్లో బలవడమే అవుతుంది. ఇప్పటికైనా అట్టడుగు వర్గాలంతా మేల్కొని కుమ్మెర ఘటనలో న్యాయం కోసం ఉద్యమించాలి. లేదంటే చరిత్రలో తప్పుచేసిన వాళ్ళుగా మిగిలిపోతారు.

# నారసింహుడి తెప్పోత్సవాలు

దక్షిణ కాశిగా, హరిహర క్షేత్రంగా, నవనారసింహ క్షేత్రాలలో నొకటిగా వాసికెక్కిన సాంప్రదాయాల సిరియైన ధర్మపురి క్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో అంతర్భాగంగా శ్రీ ఉగ్ర నారసింహ, శ్రీవేంకటేశ్వర స్వాముల తెప్పోత్సవ, డోలోత్సవాలు మార్చి 4,5వ తేదీలలో బుధ, గురు వారాలలో వరుసగా జరుగనున్నాయి. ధర్మపురి పట్టణ నడి బొడ్డున వెలసి విశేష పౌరాణిక, చారిత్రిక, ఐతిహాసిక ప్రాధాన్యతను కలిగిన, దక్షిణ భారతావని లోనే అతిపెద్దదిగా భావించబడే బ్రహ్మ పుష్కరిణి (కోనేరు )లో మూడు రోజులు పగలు మూడు గంటల నుండి రాత్రి తొమ్మిది వరకు నిర్వహించే కార్యక్రమాలలో స్వాముల ఉత్సవ మూర్తులను ప్రత్యేక ప్రత్యేక నిర్మిత బల్లకట్టుపై ఆశీనుల గావించి, కోనేటి నీటిపై ఐదు ప్రదక్షిణలు గావించడం అనాదీగా క్షేత్రంలో ఆచరిస్తున్న సత్సాంప్రదాయం. హిరణ్య కశిపుని సంహారానంతరం, ఉగ్రనారసింహుని శాంతింప జేసేందుకు బ్రహ్మాది దేవతలు తపో, యజ్ఞ ధ్యానాది సత్కర్మల నొనరించిన నేపథ్యంలో, బ్రహ్మ తన మంత్ర దండంతో ఈ క్షేత్రంలో భూమిన త్రవ్వి కుండమును నిర్మించి, అందలి జలమున స్నానమాడి, శ్రీనృసింహుని గురించి తపమొనరించి, అనుగ్రహం పొంది ఆ దేవదేవుని మందిరాన వసింపుమని వరం పొందడం జరిగిం దని, బ్రహ్మ దేవుడు స్నానమాచరించిన స్థలానికే “బ్రహ్మ పుష్కరిణి”, యని పేరు వచ్చినదని పృథు మహారాజుకు నారదమునీంద్రుడు వివరించి నట్లు నైమిశారణ్యంలో శౌనకాది మహర్షులకు సూత పౌరాణికులు చెప్పినట్లు స్కంద, బ్రహ్మాండ పురాణ అంతర్గత క్షేత్ర మహాత్మ్యం ప్రాచీన గ్రంథాలు విశదీకరిస్తున్నాయి. సంతాన హీనుడైన లక్ష్మణుడను బోయరాజు, నారద మునీంద్రుని ద్వారా నారసింహ మంత్రో పదేశం గావింపబడి, ఆ మంత్ర జప బల ముచే పుత్ర ప్రాప్తి నొందెనని, అయితే లక్ష్మణునకు ధర్మపురి క్షేత్రంలో నిద్రించిన సమయంలో స్వప్నమందు శ్రీనృసింహుడు దర్శనమిచ్చి బ్రహ్మ పుష్కరిణికి నలు వైపులా సోపానాలు , మధ్య బాగాన వేదికను, శ్వేత వరాహ తీర్థం నుండి కోనేరు లోనికి జలము వచ్చు మార్గమును నిర్మింపుమని ఆజ్ఞాపించెను అని, భగవదాదేశానుసారం, ఆ ఎరుకల రాజు అన్నియూ నిర్మించి, అందులకై అయిన ఖర్చును రాసి పెట్టెనని, ఫలితంగా నృసింహుడు ఆగ్రహించి పుష్కరిణికి రానని ప్రకటించి, తిరిగి లక్ష్మణుని ప్రార్థన పై, ప్రతి సంవత్సరం పాలుణ శుక్ల పూర్ణిమనాడు, విహారార్థం సుముఖుడనై ఏతెంచ గలనని వరమిచ్చినట్లు పురాణాలు స్పష్ట పరుస్తున్నాయి. ఉదయగిరి సీమను ఏలిన రాయల దండులో కరీంనగరం మండలం లోనికి ప్రవేశించిన జూపల్లి సంతతిలోని వాడగు జూపల్లి ధర్మా రాయుడు , తన నాటికేయున్న బ్రహ్మపుష్కరిణి నలువైపులా సోపానాలను, మధ్యలో వేదికను నిర్మింప జేసెనని, తరువాత శాలివాహన శకం 1566 పార్థివ సంవత్సరంలో (క్రీ.శ.1645 ) చింతల నరుస బోయని కుమారుడగు తిరుమలయ పుష్కరిణి చుట్టూ ప్రాకారం మధ్య వేదికపై భోగ మండపం నిర్మింప జేసి దీపారాధనలతో , ఓడలోన మహోత్సవముతో శ్రీనృసింహుని కొలిచెనని పుష్కరిణిలోని శాసనం ద్వారా తెలుస్తున్నది.

# మహిళలకు ఈ నీరు ఒక వరం



మెంతులను కేవలం పోపు దినుసులగానే కాకుండా ఒక సూపర్ ఫుడ్‌గా పరిగణించాలి. ఇందులో శరీరానికి అవసరమైన ఫైబర్, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ ః6 శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి.నానబెట్టిన మెంతులు ఎందుకు?: శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం.. మెంతుల్లోని సాపోనిన్లు, ఫినోలిక్ సమ్మేళనాలు శరీరంలోని వాపును తగ్గించడంలో కీలకంగా పనిచేస్తాయి.రాత్రంతా మెంతి గింజలను నీటిలో నానబెట్టి, ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఆ నీటిని తాగి, గింజలను నమలడం వల్ల పోషకాలు నేరుగా రక్తంలోకి చేరుతాయి.గుండె – జీర్ణక్రియ: చెడు కొలెస్ట్రాల్ తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ పెంచడంలో మెంతులు సహాయపడతాయి. ఇది ధమనులలో అడ్డంకులను తొలగించి గుండెను పదిలంగా ఉంచుతుంది. అంతేకాకుండా మెంతి నీరు తాగడం వల్ల గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు దూరమవుతాయి. ప్రేగులను శుభ్రంగా ఉంచడం ద్వారా ఇది ముఖానికి సహజమైన మెరుపును ఇస్తుంది. మధుమేహం – బరువు నియంత్రణ: రక్తంలో చక్కెర స్థాయిలను క్రమబద్ధీకరించడంలో మెంతులు అద్భుతంగా పనిచేస్తాయి. ఇవి జీవక్రియనువేగవంతం చేస్తాయి. ఆకలిని తగ్గిస్తాయి మరియు శరీరంలోని అదనపు కొవ్వును కరిగించి బరువు తగ్గడానికి సహకరిస్తాయి. మహిళల ఆరోగ్యానికి వరం: మహిళల్లో హార్మోన్ల సమతుల్యతకు మెంతులు ఒక దివ్యౌషధం. హార్మోన్లను నియంత్రించడం ద్వారా ఖఅూఆ, థైరాయిడ్, క్రమరహిత రుతుక్రమం వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తాయి. ఈస్ట్రోజెన్ స్థాయిలను సమతుల్యం చేయడం ద్వారా చర్మం యవ్వనంగా ఉండటానికి, జుట్టు దృఢంగా పెరగడానికి ఇవి తోడ్పడతాయి. చిన్న గింజలే కదా అని తక్కువ అంచనా వేయకుండా, రోజువారీ జీవనశైలిలో మెంతులను భాగం చేసుకుంటే దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ప్రకృతి ప్రసాదించిన ఈ ఔషధ గనితో ఆరోగ్యకరమైన జీవితం మీ సొంతం.

# బాడీని ఫిల్టర్ చేసే అద్భుతమైన డ్రింక్



ఆధునిక జీవనశైలి కారణంగా గ్యాస్, ఎసిడిటీ వంటి జీర్ణ సమస్యలు చాలామందిని వేధిస్తున్నాయి. అయితే ధనియాలు, జీలకర్ర, మిరియాలు, లవంగాలు, పసుపుతో తయారుచేసిన కషాయం ఈ సమస్యలకు తక్షణ ఉపశమనం అందిస్తుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచి, రోగనిరోధక శక్తిని పెంచి, పలు అనారోగ్యాలను నివారిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుత జీవనశైలి, ఒత్తిడి, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం వంటి కారణాల వల్ల చాలామంది గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం, అజీర్ణం వంటి జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ఛాతీలో మంట, పుల్లటి త్రేనుపులు, గొంతులో అడ్డుపడినట్లు ఉండటం వంటివి ఈ సమస్యల సాధారణ లక్షణాలు. ఆహారం జీర్ణాశయంలోకి చేరినప్పుడు ఉత్పత్తి అయ్యే హైడ్రోక్లోరిక్ యాసిడ్ పైకి ఎగదన్నడం వల్ల ఈ మంట, ఎసిడిటీ సమస్యలు వస్తాయి. ఈ సమస్యల నుండి ఉపశమనం పొందడానికి తరచుగా మందుల వాడకం కంటే, ఆయుర్వేద చిట్కాలను పాటించడం ఉత్తమమని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు. మన పూర్వీకులు నమ్మిన ఒక ప్రభావవంతమైన ఆయుర్వేద చిట్కా ధనియాల కషాయం. ఇది గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలకు తక్షణ ఉపశమనాన్ని అందించి, అనేక ఇతర ఆరోగ్య ప్రయోజనాలను చేకూరుస్తుంది. కషాయం తయారీ విధానం: ఒక గ్లాసు లేదా అర లీటరు నీటిని తీసుకోండి. అందులో ఒక టేబుల్ స్పూన్ ధనియాలు, ఒక టేబుల్ స్పూన్ జీలకర్ర, మూడు లేదా నాలుగు నల్ల మిరియాలు, మూడు లేదా నాలుగు లవంగాలు (లవంగాల మధ్యలో ఉండే పువ్వు తీసివేసి), చిటికెడు పసుపు వేయండి. ఈ మిశ్రమాన్ని స్టవ్ మీద పెట్టి, నీరు సగం అయ్యేంత వరకు బాగా మరిగించాలి. నీరు సగం అయ్యే వరకు మరిగించండి. ధనియాలు: ఆయుర్వేదం ప్రకారం ధనియాలకు శరీరాన్ని చల్లబరిచే గుణం ఉంది. ఇవి గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలకు చక్కగా పనిచేస్తాయి. జీలకర్ర: జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.
**మిరియాలు:** అజీర్తి సమస్యలకు చక్కటి ఔషధంలా పనిచేస్తాయి. కడుపు ఉబ్బరాన్ని తగ్గించి, గ్యాస్, ఎసిడిటీకి ఉపశమనం కలిగిస్తాయి. హైడ్రోక్లోరిక్ యాసిడ్ ఉత్పత్తికి సహాయపడి, ఆహారం ఎక్కువసేపు జీర్ణాశయంలో నిల్వ ఉండకుండా చేస్తాయి. లవంగాలు: ఇవి కేవలం సుగంధ ద్రవ్యాలు మాత్రమే కావు, కాల్షియం, ఫాస్ఫరస్, సోడియం, విటమిన్ ఎ వంటి పోషక విలువలు పుష్కలంగా ఉంటాయి. ఇవి గ్యాస్, కడుపు ఉబ్బరాన్ని నివారిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయి. పసుపు: ఇందులో ఉండే ఔషధ గుణాలు జీర్ణక్రియకు సహాయపడతాయి. జీర్ణ సమస్యలు: గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం, కడుపు ఉబ్బరం వంటి సమస్యల నుండి తక్షణ ఉపశమనం.గుండె ఆరోగ్యం: రక్తంలో ఉండే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె జబ్బులు రాకుండా సహాయపడుతుంది.రోగనిరోధక శక్తి: శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి, ఇన్ఫెక్షన్లు వంటి వ్యాధులు రాకుండా చేస్తుంది.సాధారణ వ్యాధులు: జలుబు, దగ్గు, జ్వరం, ఆయాసం, విరోచనాలు వంటి సమస్యలతో బాధపడేవారికి ఉపశమనం.అంతర్గత శుద్ధి: జీర్ణాశయంలో ఉండే క్రిములు, ఏలిక పాములు వంటివి చనిపోవడానికి సహాయపడుతుంది. మధుమేహం నియంత్రణ: డయాబెటిస్ ఉన్నవారిలో రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది.

# భోజనం తర్వాత తాంబూలం అలవాటు ఉందా?



పూజ అయినా, వివాహ వేడుక అయినా లేదా మరే ఇతర వేడుక అయినా ప్రతి శుభకార్యలోనూ తమలపాకులు తప్పనిసరిగా ఉండాల్సిందే. వీటికి మతపరమైన ప్రాముఖ్యతతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. తమలపాకులలో సహజంగా యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు.. భారతీయ సంస్కృతిలో తమలపాకులకు విశేష ప్రాముఖ్యత ఉంది. పూజ అయినా, వివాహ వేడుక అయినా లేదా మరే ఇతర వేడుక అయినా ప్రతి శుభకార్యలోనూ తమలపాకులు తప్పనిసరిగా ఉండాల్సిందే. వీటికి మతపరమైన ప్రాముఖ్యతతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. తమలపాకులలో సహజంగా యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థను నిర్వహించడానికి, దుర్వాసనను తొలగించడానికి, శరీరాన్ని నిర్విషీకరణ చేయడానికి సహాయపడతాయి. అందుకే ఇంట్లో పెద్ద వాళ్లు భోజనం తర్వాత తమలపాకులను నమలుతారు. తమలపాకులలో ఉండే పోషకాలు జీర్ణక్రియకు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. వీటిని తినడం వల్ల జీర్ణవ్యవస్థ బలపడుతుంది. అజీర్ణం, గ్యాస్, మలబద్ధకం, ఉబ్బరం, ఆమ్లత్వం వంటి సమస్యల నుండి బయటపడటానికి కూడా ఇది సహాయపడుతుంది. ప్రతిరోజూ భోజనం తర్వాత తమలపాకు తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది. ఇది మీ మనసును ప్రశాంతంగా ఉంచి మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. భోజనం తర్వాత తమలపాకు తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఇది డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అల్సర్ వంటి తీవ్రమైన సమస్యల నుంచి మిమ్మల్ని రక్షిస్తుంది. నోటి దుర్వాసన అనేది చాలా మంది ఎదుర్కొనే ఒక సాధారణ సమస్య. తమలపాకులను నమలడం వల్ల దుర్వాసన తొలగిపోతుంది. దీని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు నోటిలో దుర్వాసనకు ప్రధాన కారణమైన హానికరమైన బ్యాక్టీరియా పెరుగుదలను తగ్గిస్తాయి. ఇది అద్భుతమైన సహజ మౌత్ ఫ్రెషనర్‌గా పనిచేస్తుంది.పంటి నొప్పి, చిగుళ్ళలో రక్తస్రావం వంటి సమస్యలకు తమలపాకులు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. తమలపాకులలో విటమిన్ సి ఉంటుంది. ఉదయం ఖాళీ కడుపుతో నమలడం వల్ల చిగుళ్ళు బలపడతాయి. దంత సమస్యలు తొలగిపోతాయి. తమలపాకులలో టానిన్లు, ప్రొపేన్ ఉంటాయి. ఇవి శరీరం నుంచి విషాన్ని తొలగించి ఆరోగ్యకరమైన శరీరాన్ని నిర్వహించడంలో సహాయపడతాయి. అమెరికన్ నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ ప్రకారం తమలపాకులో సహజ యాంటీ బాక్టీరియల్, యాంటీ ? ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఉన్నాయి. అవి శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో, ఇన్ఫెక్షన్లతో పోరాడడంలో సహాయపడతాయి. జలుబు, దగ్గు, గొంతు నొప్పి, దుర్వాసన వంటి సాధారణ సమస్యలకు చికిత్స చేయడానికి ఆయుర్వేదంలో శతాబ్దాలుగా దీనిని ఉపయోగిస్తున్నారు.



# వేప ఆకుల నమలితే శరీరంలో జరిగే మార్పు ఇదే!

కొన్ని మూలికలు చాలా ప్రభావవంతంగా ఉంటాయి. వాటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఒకేసారి ఎన్నోరకాల వ్యాధులకు చికిత్స చేయడంలో సహాయపడుతుంది. వేప అటువంటి ఆయుర్వేద మూలికలలో ఒకటి. ఇది చర్మం నుండి శరీరం వరకు అనేక ముఖ్యమైన అవయవాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుంది. ఆయుర్వేదం ప్రకారం, ఎండాకాలంలో వేప పువ్వులు తినడం వల్ల శరీరం ప్రశాంతంగా ఉంటుంది. ఈ పువ్వులు పిత్తను శాంతపరుస్తాయని చెబుతారు. ఈ కారణంగా, దక్షిణ భారతదేశంలో వేసవి ప్రారంభంలో వీటిని తింటారు. వేపలో యాంటీఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, ఇమ్యునోమోడ్యులేటరీ లక్షణాలు ఉన్నాయి. ఈ మూలిక రక్తాన్ని శుద్ధి చేస్తుంది. జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. చర్మ ఛాయను మెరుగుపరుస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల కురుపులు, రింగ్‌వా, దురద వంటి చర్మ సమస్యలకు చికిత్స చేయడంలో సహాయపడుతుంది. వేపను చేదుగా భావిస్తారు. కానీ, ఆయుర్వేదంలో చాలా ప్రయోజనకరమైన ఔషధంగా భావిస్తారు. ఖాళీ కడుపుతో వేప ఆకులను నమలడం ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తుంది. వేప ఆకులను నమలడం వల్ల రక్తం శుద్ధి అవుతుంది. చర్మ సంబంధిత సమస్యలు తగ్గుతాయి. ఇది నోటి కుహరంలోని బ్యాక్టీరియాను చంపి దంతాలు, చిగుళ్ళను బలపరుస్తుంది. వేప తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కడుపులో గ్యాస్, ఆమ్లత్వం తగ్గుతుంది. డయాబెటిస్‌లో రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో ఇది సహాయకరంగా పరిగణించబడుతుంది. వేప ఆకులు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తాయి. దీని రెగ్యులర్ వినియోగం శరీరాన్ని లోపలి నుండి శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. వేప ఆకులను తినడం వల్ల రక్తంలో చక్కెర, రక్తపోటు, కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఆయుర్వేదంలో వేప ఆకులు, పువ్వుల రసం లేదా కషాయాన్ని రోగనిరోధక శక్తిని పెంచడానికి, దీర్ఘకాలిక వ్యాధులను నివారించడానికి, శరీరాన్ని శుభ్రపరచడానికి క్రమం తప్పకుండా తీసుకుంటారు. వేపను మాత్రమే కాకుండా కలకండతో కలిపి కూడా తీసుకోవడం వల్ల దాని ప్రయోజనాలు పెరుగుతాయి. ఈ రెండు పదార్థాలు శరీరాన్ని చల్లబరుస్తాయి. వేడి సంబంధిత సమస్యలను తగ్గిస్తాయి. అంతర్గత బలహీనతను తగ్గిస్తాయి. ఇది రోగనిరోధక శక్తిని మెరుగుపరిచే, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించే యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది. లేత వేప ఆకులు రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేసే యాంటీమైక్రోబయల్, యాంటీవైరల్, యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఈ ఆకులను తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది.

## బిజినెస్

# 'హర్మ్యాజ్'లోకి నౌకలు వస్తే పేల్చేస్తాం

ప్రపంచానికి చమురు సరఫరా చేసే అత్యంత కీలకమైన హర్మ్యాజ్ జలసంధిని ఇరాన్ మూసివేసిన సంగతి తెలిసిందే. హర్మ్యాజ్ జలసంధిలోకి ఏవైనా నౌకలు వస్తే పేల్చేస్తామని ఇరాన్ తాజాగా హెచ్చరించింది. దీంతో మిడిల్ ఈస్ట్ యుద్ధం భయంకరమైన మలుపు తిరిగినట్లైంది. అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడులకు ప్రతీకారంగా, ఇరాన్ తన అత్యంత శక్తివంతమైన వ్యూహాన్ని అమలులోకి తెచ్చింది. ప్రపంచ చమురు రవాణాలో ఐదో వంతు వాటా కలిగిన హర్మ్యాజ్ జలసంధిని తాము పూర్తిగా మూసివేస్తున్నామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ అధికారికంగా ప్రకటించింది. కేవలం మూసివేయడమే కాకుండా, ఈ మార్గం గుండా ఏ దేశానికి చెందిన నౌకలు, ఆయిల్ ట్యాంకర్లు ప్రయాణించడానికి ప్రయత్నించినా, వాటిపై క్షిపణులతో దాడులు చేస్తామని ఇరాన్ కమాండర్ ఇబ్రహీం జబారి అత్యంత కఠినమైన హెచ్చరికలు జారీ చేశారు. "ఆ ప్రాంతం నుండి ఒక్క చుక్క చమురు కూడా బయటకు వెళ్లనివ్వం" అని ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గడగడలాడిసున్నాయి. ఈ హెచ్చరిక వెలువడిన వెంటనే అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా ఎగబాకాయి. ఈ దిగ్బంధం వల్ల ముఖ్యంగా భారత్ వంటి దేశాలపై తీవ్ర ప్రభావం పడనుంది. హర్మ్యాజ్ మార్గం గుండానే సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్ మరియు ఇరాక్ నుండి భారత్‌కు చమురు సరఫరా జరుగుతుంది. ఇప్పుడు ఇరాన్ యుద్ధ నౌకలు, ఆత్మాహుతి డ్రోన్లు ఈ సన్నని సముద్ర



మార్గంలో పహారా కాస్తుండటంతో, వందలాది ఆయిల్ ట్యాంకర్లు సముద్రం మధ్యలోనే నిలిచిపోయాయి. షిప్పింగ్ కంపెనీలు తమ నౌకల భద్రత దృష్ట్యా ఈ మార్గంలో ప్రయాణాన్ని రద్దు చేసుకున్నాయి. మరోవైపు ఈ వ్యవహారంపై అమెరికా రక్షణ విభాగం స్పందిస్తూ.. హర్మ్యాజ్ జలసంధి అంతర్జాతీయ మార్గమని, దానిని మూసివేసే హక్కు ఇరాన్‌కు లేదని స్పష్టం చేసింది. కాగా ఇరాన్ తన క్షిపణి వ్యవస్థలను తీరప్రాంతం వెంబడి మోహరించడంతో, ఏ క్షణంలోనైనా సముద్రంలో నౌకలపై దాడులు జరిగే అవకాశం ఉందని రక్షణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## 98.44 శాతం రూ.2 వేల నోట్లు వెనక్కి




చలామణీలో ఉన్న 98.44 శాతం రూ.2 వేల నోట్లు తిరిగి బ్యాంకులకు చేరాయని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సోమవారం ప్రకటనలో వెల్లడించింది.ఈ ఏడాది ఫిబ్రవరి 28 నాటికి ఇంకా రూ.5,551 కోట్ల విలువైన పెద్ద నోట్లు ఇంకా ప్రజల వద్దే ఉన్నాయని తెలిపింది. 2023, మే 19న రూ. 2,000 నోట్ల ఉపసంహరణ ప్రకటన వెలువడే సమయానికి వ్యవస్థలో మొత్తం రూ. 3.56 లక్షల కోట్ల విలువైన నోట్లు ఉన్నాయి. ఈ నోట్లను ఆర్‌బీఐ చలామణి నుంచి ఉపసంహరించుకున్నప్పటికీ అవి చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయి. ఎవరి వద్దనైనా ఆ నోట్లు ఉంటే ఆర్‌బీఐ కార్యాలయాల్లో డిపాజిట్ చేయవచ్చు లేదా మార్చుకోవచ్చు. 2023, అక్టోబర్ 9వ తేదీ నుంచి ఆయా నోట్లను వ్యక్తులు, సంస్థలు ఆర్‌బీఐ ఆఫీసుల్లో అందజేస్తే, ఆ మొత్తాన్ని వారి అకౌంట్లలో డిపాజిట్ చేసే అవకాశం కల్పించింది. అదేవిధంగా దేశవ్యాప్తంగా ఉన్న పోస్టాఫీసుల నుంచి కూడా ప్రజలు తమ వద్ద రూ. 2,000 నోట్లను ఆర్‌బీఐకి పోస్టల్ రూపంలో పంపి, తమ అకౌంట్లలో క్రెడిట్ చేయించుకొనే వీలు కల్పించింది.

## ఇరాన్ దాడులతో అమెజాన్ క్లౌడ్ యూనిట్లలో అంతరాయం




పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా అంతర్జాతీయ వాణిజ్య, వ్యాపార కార్యకలాపాల్లో గందరగోళం నెలకొంది. అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ ప్రతీకార దాడుల మధ్య గ్లోబల్ టెక్ దిగ్గజం అమెజాన్ క్లౌడ్ యూనిట్లలో సమస్యలు తెలత్తాయని వెల్లడించింది. ముఖ్యంగా బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లోని అమెజాన్ క్లౌడ్ యూనిట్ డేటా సెంటర్లలో సోమవారం కనెక్టివిటీ సమస్యలు ఎదురయ్యాయని కంపెనీ తెలిపింది. ఇరాన్ దాడులు గల్ఫ్ వ్యాప్తంగా విమానాశ్రయాలు, ఓడరేవులు, నివాస ప్రాంతాలను తాకాయి. ఈ క్రమంలోనే తమ డేటా సెంటర్లను కూడా తాకడంతో మంటలు ఏర్పడ్డాయి. యూఏఈలోని క్లౌడ్ యూనిట్ ఏడబ్ల్యూఎస్ జోన్‌లలో ఒకదానికి పూర్తిగా విద్యుత్తు సౌకర్యం లేకుండా పోయింది. తర్వాత కొంత రికవరీ సాధించామని, అయినప్పటికీ అదనపు కనెక్టివిటీ సమస్యలు, ఎర్రర్ కొనసాగుతోందని అమెజాన్ వివరించింది. దీనికి సంబంధించి దర్యాప్తు చేస్తున్నందున కస్టమర్లు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని సిఫార్సు చేసింది. అలాగే, కంపెనీకి చెందిన బహ్రెయిన్ డేటా సెంటర్‌లో కూడా కనెక్టివిటీ సమస్యలు నెలకొన్నాయని సమాచారం. దీనిపై కంపెనీ స్పష్టమైన వివరాలు వెల్లడించలేదు.

## పీఎఫ్ వడ్డీ రేటు ఈసారి 8.25%.. వరుసగా మూడో ఏడాది యథాతథం




ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) వరుసగా మూడో ఏడాది ఉద్యోగుల భవిష్య నిధి డిపాజిట్లపై వడ్డీరేటును 2025-26 సంవత్సరం కోసం 8.25 శాతంగా ఖరారుచేసింది. గత ఏడాది ఫిబ్రవరిలో 2024-25 సంవత్సరం కోసం వడ్డీ రేటును 8.25 శాతంగా ఈపీఎఫ్‌వో కొనసాగించింది. 2022-23లో 8.15 శాతం ఉన్న వడ్డీ రేటును 2023-24 సంవత్సరానికి 8.25 శాతానికి స్వల్పంగా పెంచిన ఈపీఎఫ్‌వో వరుసగా మూడో సంవత్సరం కూడా ఇదే రేటును కొనసాగించింది. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మాన్సుఖ్ మాండవీయ నేతృత్వంలో సోమవారం సమావేశమైన సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈపీఎఫ్ డిపాజిట్లపై 8.25 శాతం వడ్డీని జమచేయాలని సిఫార్సు చేసినట్లు మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. వడ్డీ రేటును కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన తర్వాత సభ్యుల ఖాతాల్లో వడ్డీని ఈపీఎఫ్‌వో జమచేస్తుందని పేర్కొన్నది. నిర్వహణలో లేని ఖాతాల మూసివేత కోసం ఓ పైలట్ ప్రాజెక్టుకు సీబీటీ ఆమోదం తెలిపింది. రూ.1,000 అంతకన్నా లోపు క్లెయిమ్ చేసుకోని బ్యాలెన్సులను చెల్లించేందుకు ఉద్దేశించిన ఈ పైలట్ ప్రాజెక్టు కింద ఎటువంటి దరఖాస్తు తీసుకోకుండా ఈపీఎఫ్‌వో సభ్యుల ఖాతాలో డబ్బు జమచేయడం జరుగుతుంది. ఇది విజయవంతమైన తర్వాత దీన్ని రూ.1,000 కన్నా ఎక్కువ బ్యాలెన్సు ఉన్న ఖాతాలకు వర్తింపచేయాలని ఈపీఎఫ్‌వో భావిస్తున్నది.

## రూ. 3.12 లక్షల కోట్ల ఐటీ ఎగుమతులు





'హైదరాబాద్ కేవలం టెక్నాలజీ సేవలు అందించే స్థాయి నుంచి, ప్రపంచస్థాయి ఆవిష్కరణలు సృష్టించే కేంద్రంగా మారుతోంది. జీసీసీల ఏర్పాటులోనూ నగరం ఎంతో కీలకంగా ఉంటోంది' అని హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) వెల్లడించింది. ఇక్కడి నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.3.12 లక్షల కోట్ల ఐటీ ఎగుమతులు నమోదయ్యే అవకాశముందని పేర్కొంది. 10 లక్షలకు మించి ఉద్యోగులు ఐటీ రంగంలో సేవలు అందిస్తున్నారని వివరించింది. అంకురాలు, ఇతర చిన్న సంస్థల్లోని సిబ్బందినీ కలిపితే, ఇంకా ఎక్కువగానే ఉంటారని వెల్లడించింది. తెలంగాణ ప్రభుత్వం, ఎస్‌టీపీఐ భాగస్వామ్యంతో హైసియా 33వ వార్షిక సదస్సును ఈ నెల 5న నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరవుతారని హైసియా అధ్యక్షుడు ప్రశాంత్ నందెళ్ల సోమవారం తెలిపారు. 'ఇంటెలిజెన్స్ ఎఫ్రీవేర్: లీడింగ్ ది న్యూ ఎరా ఆఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్' ఇతివృత్తంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ ఐటీ ప్రస్థానాన్ని వివరించే 'మేకింగ్ ఐటీ హ్యాపెన్' టేబుల్ బుక్, 'స్కేల్ అట్ హైదరాబాద్' నివేదికలనూ విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఉత్తమ ఐటీ కంపెనీలు, స్టార్టప్‌లకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు. అంకురాల అవార్డుల కోసం 294 దరఖాస్తులు రాగా, తుది జాబితా కోసం 40 సంస్థలను ఎంపిక చేశామని.. 10 సంస్థలకు అవార్డులు ఇస్తామని హైసియా ఉపాధ్యక్షుడు బిపిన్ పెండ్యాల వివరించారు. ఎంపికైన వాటిలో 36% స్టార్టప్‌లు సిరీస్ ఏ, బీ రౌండ్ల ద్వారా నిధులు సమీకరించాయని పేర్కొన్నారు. 12% స్టార్టప్‌లు ఏటా రూ.9 కోట్ల వార్షిక ఆదాయాన్ని మించినట్లు తెలిపారు. ఈ సదస్సులో భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు కృష్ణ ఎల్ల, అనంత్ టెక్నాలజీస్ వ్యవస్థాపకులు సుబ్బారావు పావులూరి సహా పలువురు జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు ప్రసంగించనున్నట్లు తెలిపారు.

## స్పోర్ట్స్

# ప్రపంచకప్ వైఫల్యాల తర్వాత కూడా బాబర్ ఆజమ్‌కు కెప్టెన్సీ పగ్గాలు

టీ20 ప్రపంచకప్ 2026లో వరుస వైఫల్యాల తర్వాత కూడా పాకిస్తాన్ స్టార్ ఆటగాడు బాబర్ ఆజమ్‌కు కెప్టెన్సీ పగ్గాలు దక్కాయి. పాకిస్తాన్ మీడియా నివేదికల ప్రకారం.. బాబర్ ఆజమ్ నేషనల్ టీ20 కప్ 2026లో లాహోర్ రీజియన్ వైట్స్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈ టోర్నమెంట్ ఫిబ్రవరి 5న రావల్పిండి క్రికెట్ స్టేడియంలో ప్రారంభమవుతుంది. తొలి మ్యాచ్‌లో లాహోర్ వైట్స్, పెషావర్ రీజియన్‌ను ఎదుర్కొంటుంది. గత ఎడిషన్‌లో లాహోర్ వైట్స్ క్వార్టర్ ఫైనల్ వరకు చేరినా, అబ్బొటాబాద్ రీజియన్ చేతిలో ఓటమిపాలైంది. ఈసారి బాబర్ నాయకత్వంలో లాహోర్ వైట్స్ మెరుగైన ఫలితాలు సాధించాలని మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. ఇదిలా ఉంటే, ప్రపంచకప్ 2026 ఎడిషన్‌లో పాక్ ఓ మోస్తరు ప్రదర్శనలు చేసినా సూపర్-8 దశలోనే నిష్క్రమించింది. చివరి మ్యాచ్‌లో శ్రీలంకపై విజయం సాధించినా, న్యూజిలాండ్ కంటే మెరుగైన రన్‌రేట్ లేని కారణంగా సెమీస్‌కు అర్హత సాధించలేకపోయింది. ఆరంభ మ్యాచ్‌లలో దారుణంగా విఫలమైనందుకు బాబార్ ఆజమ్‌ను శ్రీలంక మ్యాచ్ నుంచి తప్పించారు. ఈ ప్రపంచకప్‌లో బాబర్ 4 ఇన్నింగ్స్‌ల్లో కేవలం 91 పరుగులు మాత్రమే చేశాడు. అతని సగటు 22.75 కాగా, స్ట్రైక్ రేట్ 112.34గా ఉంది. ఈ చెత్త ప్రదర్శనలతో బాబర్ పాకిస్తాన్ జట్టుకు భారంగా మారాడు. గత కొన్ని సంవత్సరాలుగా పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో ఇదే తీరు కొనసాగుతుంది. 2023 వన్డే వరల్డ్‌కప్ తర్వాత బాబర్ 23 ఇన్నింగ్స్‌ల్లో కేవలం 772 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో ఓ శతకం, ఐదు అర్ధశతకాలు ఉన్నాయి. 2024 టీ20 వరల్డ్ కప్ తర్వాత అతను 20 ఇన్నింగ్స్‌ల్లో 451 పరుగులు మాత్రమే చేశాడు. అతని సగటు 26.52, స్ట్రైక్ రేట్ 118.99గా ఉంది. ఇందులో మూడు అర్ధశతకాలు ఉన్నాయి. టీ20 ప్రపంచకప్‌లో ఘోర ప్రదర్శనల తర్వాత జాతీయ జట్టులో స్థానమే ప్రశ్నార్థకంగా మారిన తరుణంలో బాబర్‌కు దేశవాలీ జట్టు పగ్గాలు దక్కడం ఆశ్చర్యంగా ఉంది. త్వరలో బంగ్లాదేశ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు బాబర్‌తో పాటు సీనియర్లను తప్పించే అవకాశం ఉందని తెలుస్తుంది.



## టీ20 ప్రపంచకప్‌పై యుద్ధ ప్రభావం




అమెరికా, ఇజ్రాయిల్-ఇరాన్ యుద్ధ ప్రభావం భారత్, శ్రీలంక దేశాల్లో జరుగుతున్న టీ20 ప్రపంచకప్ 2026పై పడింది. ఈ మెగా టోర్నీలో సూపర్-8 దశలో నిష్క్రమించిన వెస్టిండీస్ జట్టు.. అంతర్జాతీయ ఎయిర్‌స్పేస్ పరిమితుల కారణంగా భారత్‌లోనే చిక్కుకుపోయింది. అమెరికా, ఇజ్రాయిల్ దాడులకు ప్రతిగా ఇరాన్ పలు గల్ఫ్ ప్రాంతాలపై దాడులు చేస్తున్న నేపథ్యంలో ఆ ప్రాంతాల్లో విమాన సర్వీసులు నిలిచిపోయాయి. విండీస్ జట్టు స్వదేశానికి చేరాలంటే దుబాయ్ మీదుగా వెళ్లాల్సి ఉంది. అయితే యుద్ధ నేపథ్యంలో పరిస్థితులు అనూకలించకపోవడంతో విండీస్ జట్టు భారత్‌లోనే హాల్ట్ అయ్యింది. ఈ విషయాన్ని విండీస్ క్రికెట్ బోర్డు ధృవీకరించింది. వీలైనంత త్వరగా తమ జట్టును స్వదేశానికి చేర్చే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ విషయంలో విండీస్ బోర్డుకు ఐసీసీ, బీసీసీఐ సహకరిస్తున్నాయి. మరోవైపు విండీస్‌లాగే మరో జట్టు కూడా భారత్‌లోనే ఇరుక్కుపోయింది. విండీస్‌లాగే సూపర్-8లోనే నిష్క్రమించిన జింబాబ్వే కూడా యుద్ధ ప్రభావం చేత విమాన రాకపోకలు నిలిచిపోవడంతో భారత్‌లో హాల్ట్ అయ్యింది. జింబాబ్వే కూడా స్వదేశానికి వెళ్లలంటే దుబాయ్ మీదుగా వెళ్లాల్సిందే. జింబాబ్వే పరిస్థితిని కూడా ఐసీసీ దగ్గరగా పర్యవేక్షిస్తుంది. వీలైనంత త్వరగా జింబాబ్వే జట్టును స్వదేశానికి పంపేందుకు ఏర్పాట్లు చేస్తుంది. ఇదిలా ఉంటే వెస్టిండీస్, జింబాబ్వే జట్లు ప్రపంచకప్‌లో సూపర్-8లోనే నిష్క్రమించాయి. ఈ రెండు జట్లు భారత్‌తో పాటు గ్రూప్-1లో ఉన్నాయి. ఈ గ్రూప్ నుంచి భారత్, సౌతాఫ్రికా సెమీస్‌కు చేరాయి. గ్రూప్-2 నుంచి ఇంగ్లండ్, న్యూజిలాండ్ ఫైనల్-4కు అర్హత సాధించాయి. తొలి సెమీఫైనల్లో సౌతాఫ్రికా, న్యూజిలాండ్.. రెండో సెమీఫైనల్లో భారత్-ఇంగ్లండ్ అమీతుమీ తేల్చుకుంటాయి. తొలి సెమీస్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా మార్చి 4వ తేదీ రాత్రి 7 గంటలకు ప్రారంభమవుతుంది. రెండో సెమీఫైనల్ ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా రాత్రి 7 గంటలకే మొదలవుతుంది.

# సెమీస్‌కు అంపైర్లు వీరే!

టీ20 ప్రపంచకప్ 2026 తుది దశకు చేరింది. నాలుగు సెమీఫైనల్ బెర్తులు ఖరారయ్యాయి. తొలి సెమీఫైనల్లో సౌతాఫ్రికా, న్యూజిలాండ్.. రెండో సెమీఫైనల్లో భారత్-ఇంగ్లండ్ అమీతుమీ తేల్చుకుంటాయి. తొలి సెమీస్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా మార్చి 4వ తేదీ రాత్రి 7 గంటలకు ప్రారంభమవుతుంది. రెండో సెమీఫైనల్ ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా రాత్రి 7 గంటలకే మొదలవుతుంది. ఈ మ్యాచ్‌లకు అఫీషియల్స్ జాబితాను (అంపైర్లు, రిఫరీలు) ఐసీసీ ఇవాళ ప్రకటించింది. ఎనిమిది మంది అంపైర్లు, ఇద్దరు మ్యాచ్ రిఫరీల పేర్లను వెల్లడించింది. ఎప్పటిలాగే తటస్థ అధికారులను నియమించింది.

సౌతాఫ్రికా వర్సెస్ న్యూజిలాండ్ తొలి సెమీఫైనల్

- ఆన్ ఫీల్డ్ అంపైర్లు: రిచర్డ్ ఇల్లింగ్వర్త్, అలెక్స్ వార్ఫ్
- థర్డ్ అంపైర్: నితిన్ మెనన్
- నాలుగో అంపైర్లు: రాడ్ టక్కర్
- మ్యాచ్ రిఫరీ: జవగల్ శ్రీనాథ్


**భారత్ వర్సెస్ ఇంగ్లండ్ రెండో సెమీఫైనల్**

- ఆన్ ఫీల్డ్ అంపైర్లు: క్రిస్ గాఫనీ, అల్లాహుద్దీన్ పాలేకర్
- థర్డ్ అంపైర్లు: ఎడ్రియన్ హోల్డ్‌స్టాక్

నాలుగో అంపైరు: పాల్ రైఫెల్
మ్యాచ్ రిఫరీ: ఆండీ పైక్రాఫ్ట్








# 'పెద్ది' రన్‌టైమ్‌పై క్లారిటీ.. ఆ వార్తలన్నీ పుకార్లేనన్న చిత్ర యూనిట్!

రామ్‌చరణ్, బుచ్చిబాబు కాంబోలో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'పెద్ది' గురించి సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లకు చిత్ర యూనిట్ చెక్ పెట్టింది. సినిమా నిడివి విషయంలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ అధికారికంగా క్లారిటీ ఇచ్చింది. గత కొన్ని రోజులుగా పెద్ది సినిమా నిడివి 3 గంటలకు పైగా ఉంటుందని నెట్టింట వార్తలు చక్కర్లు కొడుతున్న సంగతి తెలిసిందే. ఈ విషయంపై టీమ్ స్పందిస్తూ.. 'ప్రస్తుతానికి ఫస్టాఫ్ ఎడిటింగ్ మాత్రమే పూర్తయింది. సెకండ్ హాఫ్ షూటింగ్ ఇంకా కొనసాగుతోంది. అలాంటప్పుడు నిడివి గురించి వస్తున్న వార్తల్లో నిజం లేదు' అని స్పష్టం చేసింది. సినిమా పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఎడిటింగ్ టేబుల్ మీద ఉన్నప్పుడు ఇలాంటి పుకార్లను నమ్మవద్దని కోరింది.

# అబుదాబిలో చిక్కుకున్న ఈషా గుప్తా.. మూడు రోజుల తర్వాత ఢిల్లీ చేరుకున్నట్టు పోస్ట్



మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు తారస్థాయికి చేరడంతో అంతర్జాతీయ విమాన రాకపోకలకి ఆటంకం ఏర్పడింది. ఇరాన్ లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడుల నేపథ్యంలో పలు దేశాలు ఎయిర్‌స్పేస్‌ను మూసివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో బాలీవుడ్ నటి ఈషా గుప్తా అబుదాబిలో చిక్కుకుపోయి, మూడు రోజుల తర్వాత మార్చి 2న సురక్షితంగా ఢిల్లీకి చేరుకుంది. ఇంటికి చేరిన అనంతరం ఆ అనుభవాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఫిబ్రవరి 28న నేను ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాను. మధ్యాహ్నం ఒకటిన్నర ప్రాంతంలో ఎయిర్‌పోర్ట్‌ను మూసివేశారు. చుట్టూ గందరగోళం.. ఏం జరుగుతుందో ఎవరికీ స్పష్టంగా తెలియని పరిస్థితి అని ఈషా తెలిపారు. కొద్ది సేపటికే క్షిపణి దాడుల వార్తలు రావడం ప్రారంభమయ్యాయని, తర్వాతి క్షణంలో ఏం జరుగుతుందో తెలియని భయానక పరిస్థితి నెలకొన్నదని ఆమె పేర్కొన్నారు. అక్కడున్న వారు తమ కుటుంబ సభ్యులతో ఫోన్లలో మాట్లాడుకుంటూ, ఒకరినొకరు ఓదార్చుకుంటూ గడిపారు. ఆ మూడు రోజులు నిజంగా మానసికంగా చాలా కష్టంగా అనిపించాయి అని చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఈషా గుప్తా ప్రశంసించారు. ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న ప్రయాణికులకు ప్రత్యేకంగా భోజనం, తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేసినట్లు ఆమె వెల్లడించారు. నేను చెక్-ఇన్ పూర్తి చేయకముందే ఎయిర్‌పోర్ట్ మూసివేయడంతో తిరిగి అబుదాబిలోని హోటల్‌కు వెళ్లాను. అక్కడి సిబ్బంది ముఖాల్లో భయం కనిపించినా, ప్రయాణికులకు ఎక్కడా ఒత్తిడి కలగకుండా ఎంతో సమర్థంగా పనిచేశారు అని ఈషా పేర్కొన్నారు. ఇక ఈషా గుప్తాతో పాటు దుబాయ్‌లో తమిళ స్టార్ అజిత్ కుమార్, టాలీవుడ్ నటుడు మంచు విష్ణు, నటి సోనాల్ చౌహన్, బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీ, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు కూడా చిక్కుకుపోయినట్లు సమాచారం. ఈషా సురక్షితంగా భారత్ చేరుకోవడంతో అభిమానులు ఊపిరిపీల్చుకున్నప్పటికీ, మిగిలిన వారంతా సురక్షితంగానే ఉన్నారనే అధికారిక సమాచారం కోసం ఎదురు చూస్తున్నారు.



# అడల్ట్ కంటెంట్ ఉన్నా.. ఫ్యామిలీతో చూడొచ్చు..

యూత్ ఫుల్ ఎంటర్టైనర్‌గా రాబోతున్న చిత్రం 'సువర్ణ టెక్స్టైల్స్'. శివకుమార్ రామచంద్రవరపు, డిబోరా డోరిస్ ఫెల్, రాజశేఖర్ అనింగి, విక్రమాదిత్య డాంబర్ ప్రధాన పాత్రల్లో ప్రశాంత్ నామిని రచన దర్శకత్వంలో తెరకెక్కుతోంది. తాజాగా ఈ మూవీ టీజర్‌ను దర్శకుడు వేణు ఉడుగుల రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా హీరో శివకుమార్ మాట్లాడుతూ.. "సువర్ణ టెక్స్టైల్స్'లో నన్ను హైటెక్ సిటీ వీధుల్లో నైటీ వేసుకుని పరిగెత్తించాడు. మంచి జీల్ ఉన్న దర్శకుడు ప్రశాంత్ నామిని.ఎంతో ప్యాషన్‌తో సినిమా తీశాడు. కచ్చితంగా నచ్చుతుంది. యూత్‌కు బాగా కనెక్ట్ అవుతుంది. టీజర్ చూసారుగా ఎవరిని డిజప్పాయింట్ అయితే చేయదు' అన్నారు.దర్శకుడు వేణు ఉడుగుల మాట్లాడుతూ.. టీజర్ చాలా బాగుంది. టీజర్ ఎలా ఉందో సినిమా కూడా అలానే తీస్తే మాత్రం అందరూ మాట్లాడుకునే సినిమా అవుతుంది. ఈ సినిమాతో ప్రశాంత్ నామిని ఓ మంచి దర్శకుడు అవుతాడని చెప్పుకొచ్చారు. దర్శకుడు ప్రశాంత్ నామిని మాట్లాడుతూ... ఇదొక కొత్త జానర్. కొంత అడల్ట్ కంటెంట్ ఉన్నా... ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ సినిమా ఇది అని ముగించారు.


# నేను ఎవరికీ సపోర్ట్ చేయడం లేదు



ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా పుణ్యమా అని సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాల గురించి రకరకాల వార్తలు పుట్టుకొస్తున్నాయి. ముఖ్యంగా కొందరు యూట్యూబర్లు కేవలం వ్యూస్ కోసం సెలబ్రిటీల ఆస్తుల గురించి, వారి వ్యక్తిత్వం గురించి థంబ్‌నెయిల్స్ పెట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారు.తాజాగా ఇటువంటి చేదు అనుభవం సీనియర్ నటుడు తనికెళ్ల భరణికి ఎదురైంది. గత కొన్ని రోజులుగా యూట్యూబ్‌లో తనికెళ్ల భరణి ఆస్తులకు సంబంధించిన వీడియోలు విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. తనికెళ్ల భరణి (ుజీనితినివశ్రీశ్రీజీ ఃష్ట్రజీతీజీనితి)ఆస్తులు చూస్తే మైండ్ పోవాల్సిందే అనే రేంజ్‌లో ప్రచారం మొదలైంది. ఆయన ఇంటి ముందు అరడజను ఖరీదైన కార్లు ఉన్నాయని, కోట్లలో ఆస్తులు ఉన్నాయని కొందరు వార్తలు సృష్టించారు. తాజాగా, ఈ పుకార్లపై తనికెళ్ల భరణి ఒక వీడియో ద్వారా చాలా సున్నితంగా, అంతే స్పష్టంగా క్లారిటీ ఇచ్చారు. "నా ఆస్తులు చూసి అందరూ షాక్ అవ్వాల్సిందే అని రాశారు, కానీ ఆ వార్తలు చూసి నేనే షాక్ అయ్యాను" అని ఆయన నవ్వుతూ వ్యాఖ్యానించారు. తన ఇంటి ముందు కార్లు ఉన్నాయని చూపిస్తున్న దృశ్యాల్లో వాస్తవం లేదని, ఆ వార్తలు చూసి తన కుటుంబ సభ్యులంతా కలిసి నవ్వుకున్నామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాల నేపథ్యంలో, తాను ఏదో ఒక దేశానికి లేదా ఒక మతానికి మద్దతు ఇస్తున్నట్లు వస్తున్న వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు. తాను అన్ని మతాలను, అన్ని వర్గాల ప్రజలను సమానంగా గౌరవిస్తానని స్పష్టం చేశారు.

## తండ్రి అయిన యంగ్ హీరో

కోలీవుడ్ యంగ్ హీరో హరీష్ కళ్యాణ్ తండ్రి అయ్యాడు. తన జీవితంలో అత్యంత మధురమైన ఘట్టాన్ని సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంటూ అధికారికంగా ప్రకటించారు.హరీష్ కళ్యాణ్ భార్య నర్మద ఉదయకుమార్ మార్చి 2న ఆడపిల్లకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని తెలుపుతూ హరీష్ ఒక ఎమోషనల్ నోట్ విడుదల చేశారు. "నా జీవితంలోని అద్భుతమైన విషయాన్ని మీతో పంచుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మా జీవితాల్లో కొత్త అధ్యాయం మొదలైంది. మార్చి 2వ తేదీన నర్మదకు, నాకు పాప పుట్టింది. ప్రస్తుతం తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు" అని రాసుకొచ్చారు. తమ కుటుంబంపై చూపిస్తున్న ప్రేమాభిమానాలకు హరీష్ కృతజ్ఞతలు తెలిపారు. "కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు మాపై చూపిస్తున్న ఆదరణ మాకెంతో ఆనందంగా ఉంది. అందరికీ ధన్యవాదాలు.. ఓం నమశివాయ" అంటూ తన సంతోషాన్ని వ్యక్తపరిచారు. కాగా.. హరీష్ కళ్యాణ్-నర్మద 2022 అక్టోబర్‌లో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. పెళ్లయిన నాలుగేళ్లకు ఈ జంట తల్లిదండ్రులుగా తమ కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టారు. ప్రస్తుతం ఈ యంగ్ హీరో తండ్రి అయ్యారనే వార్త తెలియగానే సోషల్ మీడియాలో అభిమానులు, సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com